وَاعْلَمُوٓا أَنَّمَا غَنِمْتُم مِّن شَىْءٍ فَأَنَّ لِلَّهِ
خُمُسَهُۥ وَلِلرَّسُولِ وَلِذِى الْقُرْبَىٰ وَالْيَتَٰمَىٰ
وَالْمَسَٰكِينِ وَابْنِ السَّبِيلِ إِن كُنتُمْ ءَامَنتُم
بِاللَّهِ وَمَآ أَنزَلْنَا عَلَىٰ عَبْدِنَا يَوْمَ الْفُرْقَانِ يَوْمَ
الْتَقَى الْجَمْعَانِ ۗ وَاللَّهُ عَلَىٰ كُلِّ شَىْءٍ قَدِيرٌ ﴿٤١﴾

41. [(*)] మరియు మీ విజయధనంలో[14] నిశ్చయంగా, అయిదవభాగం, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు మరియు (అతని) దగ్గరిబంధువులకు మరియు అనాథులకు మరియు యాచించని పేదవారికి[15] మరియు ప్రయాణీకులకు ఉందని తెలుసుకోండి, ఒకవేళ మీరు - అల్లాహ్‌ను మరియు మేము సత్యాసత్యాల అంతరాన్ని విశదంచేసే దినమున, ఆ రెండు సైన్యాలు మార్కొనిన (బద్ర్‌యుద్ధ) దినమున, మా దాసునిపై అవతరింపజేసిన దానిని - విశ్వసించేవారే అయితే! మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.[16]

إِذْ أَنتُم بِالْعُدْوَةِ الدُّنْيَا وَهُم بِالْعُدْوَةِ
الْقُصْوَىٰ وَالرَّكْبُ أَسْفَلَ مِنكُمْ ۚ وَلَوْ

42. (ఆ దినాన్ని గుర్తుకు తెచ్చుకోండి!) అప్పుడు మీరు లోయలో (మదీనాకు) సమీపంగా ఉన్నస్థలంలో ఉన్నారు మరియు వారు (ముష్రికులు) దూరంగా ఉన్న స్థలంలో ఉన్నారు.[17] మరియు బిడారం మీకు క్రింది (ఒడ్డు) వైపునకు. ఒకవేళ మీరు (ఇరువురు) యుద్ధం చేయాలని నిర్ణయించుకొని ఉంటే! మీరు మీ

---

14. 'గనీమతున్: విజయధనం, అంటే సత్యతిరస్కారులతో జరిగిన ధర్మయుద్ధంలో గెలుపు పొందిన తరువాత ముస్లింలకు దొరికేదంతా.

15. ఇక్కడ అల్ మిస్కీనున్, అనే శబ్దం ఉంది. ఇది అల్ ఫుఖరా కంటే భిన్నమైనది. ఫఖీరున్ అంటే ఏమీ లేనందుకు ఇతరులనుండి యాచించే వాడు. మిస్కీన్ అంటే అతని దగ్గర కొంత ఆదాయం ఉంది, కాని అది అతని నిత్యావసరాలకు పూర్తికాదు. ఇట్టివారు తమస్వాభిమానం వల్ల ఇతరులను సహాయానికై యాచించరు.

16. బద్ర్ యుద్ధం యుద్ధ సామాగ్రి తక్కువ తీసుకొని కేవలం వాణిజ్య బిడారాన్ని దోచుకోవటానికి వచ్చిన **313** ముస్లింలు మరియు వారిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో! అత్యధిక యుద్ధసామాగ్రితో వచ్చిన ముష్రిక్ ఖురైషుల మధ్య జరిగింది. అల్లాహ్ (సు.తా.) తాను పంపిన ప్రవక్త ము'హమ్మద్ ('స'అస) సత్యవంతుడు, సన్మార్గంపై ఉన్నాడు మరియు తాను పంపిన, జీవన మార్గమే (ఇస్లామే), మోక్షం (స్వర్గం) పొందటానికి సరైన మార్గమని నిరూపించదలచి, ఈ యుద్ధాన్ని చేయించి, ముస్లింలకు విజయాన్ని చేకూర్చి, సత్యాసత్యాల మధ్య భేదాన్ని నిరూపించాడు. చివరకు సత్యమే వర్ధిల్లుతుందని చూపాడు.

17. 'ఉద్‌వతిద్దునియా: సమీప స్థలం. అంటే బద్ర్ లోయలో, మదీనా నుండి సమీపంలోనున్న స్థలం. మరియు 'ఉద్‌వతిల్ ఖు'స్వా: అంటే, బద్ర్ లోయలో, మొదటి స్థలంతో పోల్చితే మదీనా నుండి దూరంగా ఉన్న స్థలం.

تَوَاعَدتُّمْ لَاخْتَلَفْتُمْ فِي الْمِيعَادِ ۙ وَلَٰكِن لِّيَقْضِيَ اللَّهُ أَمْرًا كَانَ مَفْعُولًا لِّيَهْلِكَ مَنْ هَلَكَ عَن بَيِّنَةٍ وَيَحْيَىٰ مَنْ حَيَّ عَن بَيِّنَةٍ ۗ وَإِنَّ اللَّهَ لَسَمِيعٌ عَلِيمٌ ﴿٤٢﴾

నిర్ణయాన్ని పాటించకుండా ఉండేవారు. కాని అల్లాహ్ తానునిర్ణయించిన కార్యాన్ని పూర్తిచేయటానికి, నశించేవాడు స్పష్టమైన నిదర్శనం పొందిన తరువాత నశించాలని మరియు జీవించే వాడు స్పష్టమైన నిదర్శనం పొందిన తరువాత జీవించాలని అలా చేశాడు. మరియు నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

إِذْ يُرِيكَهُمُ اللَّهُ فِي مَنَامِكَ قَلِيلًا ۖ وَلَوْ أَرَاكَهُمْ كَثِيرًا لَّفَشِلْتُمْ وَلَتَنَازَعْتُمْ فِي الْأَمْرِ وَلَٰكِنَّ اللَّهَ سَلَّمَ ۗ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿٤٣﴾

43. (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నీకు, నీ స్వప్నంలో వారిని కొద్దిమందిగా చూపింది (జ్ఞాపకంచేసుకో)! వారిని ఎక్కువమందిగా నీకు చూపిఉంటే, మీరు తప్పక ధైర్యాన్ని కోల్పోయి (యుద్ధ) విషయంలో వాదులాడేవారు. కాని వాస్తవానికి, అల్లాహ్ మిమ్మల్ని రక్షించాడు. నిశ్చయంగా, ఆయనకు హృదయాలలో ఉన్న విషయాలన్నీ బాగా తెలుసు.

وَإِذْ يُرِيكُمُوهُمْ إِذِ الْتَقَيْتُمْ فِي أَعْيُنِكُمْ قَلِيلًا وَيُقَلِّلُكُمْ فِي أَعْيُنِهِمْ لِيَقْضِيَ اللَّهُ أَمْرًا كَانَ مَفْعُولًا ۗ وَإِلَى اللَّهِ تُرْجَعُ الْأُمُورُ ﴿٤٤﴾

44. మరియు (జ్ఞాపకం చేసుకోండి) అల్లాహ్ నెరవేర్చవలసిన పనిని నెరవేర్చటానికి - మీరు (బద్ర్ యుద్ధరంగంలో) మార్కొనినపుడు - వారి (అవిశ్వాసుల) సైన్యాన్ని మీ కన్నులకు కొద్దిగా చూపాడు మరియు మిమ్మల్ని కొద్దిమందిగా వారికి చూపాడు. మరియు అన్ని వ్యవహారాలూ (నిర్ణయానికి) అల్లాహ్ వైపునకే మరలింపబడతాయి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا لَقِيتُمْ فِئَةً فَاثْبُتُوا وَاذْكُرُوا اللَّهَ كَثِيرًا لَّعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٤٥﴾

45. ఓ విశ్వాసులారా! మీరు ఏ సైన్యాన్నైనా ఎదుర్కొనేటప్పుడు, స్థైర్యంతో ఉండండి. మరియు మీరు సాఫల్యం పొందటానికి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి!

وَأَطِيعُوا اللَّهَ وَرَسُولَهُ وَلَا تَنَازَعُوا فَتَفْشَلُوا وَتَذْهَبَ رِيحُكُمْ ۖ وَاصْبِرُوا ۚ إِنَّ اللَّهَ مَعَ الصَّابِرِينَ ﴿٤٦﴾

46. మరియు అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకువిధేయులైఉండండిమరియు పరస్పర కలహాలకు గురికాకండి, అట్లు చేస్తే మీరు బలహీనులవుతారుమరియుమీ బలసాహసాలుతగ్గిపోతాయి. మరియు సహనం వహించండి. నిశ్చయంగా అల్లాహ్‌సహనంవహించేవారితో ఉంటాడు.

47. మరియు తమ గృహాలనుండి, ప్రజలకు చూపటానికి దురాభిమానంతో బయలుదేరి ఇతరులను అల్లాహ్ మార్గంనుండి ఆపేవారి వలే కాకండి. మరియు వారు చేసే క్రియ లన్నింటినీ అల్లాహ్ పరివేష్టించిఉన్నాడు.

وَلَا تَكُونُوا كَالَّذِينَ خَرَجُوا مِن دِيَارِهِم بَطَرًا وَرِئَاءَ النَّاسِ وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ ۚ وَاللَّهُ بِمَا يَعْمَلُونَ مُحِيطٌ ﴿٤٧﴾

48. మరియు (జ్ఞాపకం చేసుకోండి అవిశ్వాసులకు) వారి కర్మలు ఉత్తమమైనవిగా చూపించి షై'తాన్ వారితో అన్నాడు: "ఈ రోజు ప్రజలలో ఎవ్వడునూ మిమ్మల్ని జయించలేడు, (ఎందుకంటే) నేను మీకు తోడుగాఉన్నాను." కాని ఆ రెండుపక్షాలు పరస్పరం ఎదురుపడినపుడు, అతడు తన మడమలపై వెనకకుమరలి అన్నాడు: "వాస్తవంగా, నాకు మీతో ఎలాంటి సంబంధం లేదు, మీరు చూడనిది నేను చూస్తున్నాను. నిశ్చయంగా, నేను అల్లాహ్‌కు భయపడు తున్నాను.[18] మరియు అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడు."

وَإِذْ زَيَّنَ لَهُمُ الشَّيْطَانُ أَعْمَالَهُمْ وَقَالَ لَا غَالِبَ لَكُمُ الْيَوْمَ مِنَ النَّاسِ وَإِنِّي جَارٌ لَّكُمْ ۖ فَلَمَّا تَرَاءَتِ الْفِئَتَانِ نَكَصَ عَلَىٰ عَقِبَيْهِ وَقَالَ إِنِّي بَرِيءٌ مِّنكُمْ إِنِّي أَرَىٰ مَا لَا تَرَوْنَ إِنِّي أَخَافُ اللَّهَ ۚ وَاللَّهُ شَدِيدُ الْعِقَابِ ﴿٤٨﴾

49. కపటవిశ్వాసులు మరియు ఎవరి హృదయాలలో రోగముందో వారు: "వీరిని (ఈ విశ్వాసులను) వీరి ధర్మం మోసపుచ్చింది." అని అంటారు, కాని అల్లాహ్‌యందు నమ్మకం గలవాని కొరకు, నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు మహావివేచనాపరుడు.

إِذْ يَقُولُ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ غَرَّ هَٰؤُلَاءِ دِينُهُمْ ۗ وَمَن يَتَوَكَّلْ عَلَى اللَّهِ فَإِنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٤٩﴾

50. మరియు సత్య తిరస్కారుల ప్రాణాలను దైవదూతలు తీసే దృశ్యాన్ని నీవు చూడగలిగితే (ఎంతబాగుండేది). వారు (దేవ దూతలు) వారి ముఖాలపైనను మరియు వారి పిరుదులపైననుకొడుతూ ఇలాఅంటారు: "భగభగ మండే ఈ నరకాగ్నిశిక్షను చవి చూడండి.[19]

وَلَوْ تَرَىٰ إِذْ يَتَوَفَّى الَّذِينَ كَفَرُوا ۙ الْمَلَائِكَةُ يَضْرِبُونَ وُجُوهَهُمْ وَأَدْبَارَهُمْ وَذُوقُوا عَذَابَ الْحَرِيقِ ﴿٥٠﴾

---

18. చూడండి, **59:16**.

19. చూడండి, **6:93**.

ذٰلِكَ بِمَا قَدَّمَتْ اَيْدِيْكُمْ وَاَنَّ اللّٰهَ لَيْسَ
بِظَلَّامٍ لِّلْعَبِيْدِ ۙ﴿٥١﴾

51. "ఇది మీరు స్వయంగా మీ చేతులారా చేసి పంపిన కర్మల ఫలితమే! మరియు నిశ్చయంగా, అల్లాహ్ తనదాసులకు ఏ మాత్రం అన్యాయం చేయడు."

كَدَاْبِ اٰلِ فِرْعَوْنَ ۙ وَالَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ؕ كَفَرُوْا
بِاٰيٰتِ اللّٰهِ فَاَخَذَهُمُ اللّٰهُ بِذُنُوْبِهِمْ ؕ اِنَّ اللّٰهَ
قَوِيٌّ شَدِيْدُ الْعِقَابِ ﴿٥٢﴾

52. ఫిర్ఔన్ జాతివారి మరియు వారికి పూర్వంవారి మాదిరిగా, వీరు కూడా అల్లాహ్ సూచనలను (ఆయాత్‌లను) తిరస్కరించారు, కాబట్టి అల్లాహ్ వారి పాపాల ఫలితంగా వారిని శిక్షించాడు. నిశ్చయంగా అల్లాహ్ మహా బలవంతుడు, శిక్ష విధించటంలో చాలా కఠినుడు.[20]

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ لَمْ يَكُ مُغَيِّرًا نِّعْمَةً اَنْعَمَهَا عَلٰى
قَوْمٍ حَتّٰى يُغَيِّرُوْا مَا بِاَنْفُسِهِمْ ۙ وَاَنَّ اللّٰهَ سَمِيْعٌ
عَلِيْمٌ ۙ﴿٥٣﴾

53. ఇది ఎందుకంటే! వాస్తవానికి, ఒక జాతి వారు, తమ నడవడికను తాము మార్చుకోనంత వరకు, అల్లాహ్ వారికి ప్రసాదించిన తన అనుగ్రహాన్ని ఉపసంహరించుకోడు.[21] మరియు నిశ్చయంగా అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

كَدَاْبِ اٰلِ فِرْعَوْنَ ۙ وَالَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ؕ
كَذَّبُوْا بِاٰيٰتِ رَبِّهِمْ فَاَهْلَكْنٰهُمْ بِذُنُوْبِهِمْ
وَاَغْرَقْنَاۤ اٰلَ فِرْعَوْنَ ۚ وَكُلٌّ كَانُوْا ظٰلِمِيْنَ ﴿٥٤﴾

54. ఫిర్ఔను జాతి వారు మరియు వారికి పూర్వం వారి మాదిరిగా! వీరు కూడా తమ ప్రభువు సూచనలను (ఆయాత్‌లను) అబద్ధాలని నిరాకరించారు. కాబట్టి వారి పాపాలకు ఫలితంగా వారిని నాశనంచేశాము. మరియు ఫిర్ఔను జాతివారిని ముంచివేశాము. మరియు వారందరూ దుర్మార్గులు.[22]

اِنَّ شَرَّ الدَّوَآبِّ عِنْدَ اللّٰهِ الَّذِيْنَ كَفَرُوْا فَهُمْ
لَا يُؤْمِنُوْنَ ۖۚ﴿٥٥﴾

55. నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో సత్యాన్ని తిరస్కరించేవారు నీచాతినీచమైన జీవులు, ఇక వారు విశ్వసించరు.[23]

---

20. షదీద్ అల్-'ఇఖాబ్: *Severe in Chastising* కఠినంగా శిక్షించేవాడు, పటిష్ఠంగా పట్టుకునేవాడు.

21. చూడండి, **13:11**.

22. అల్లాహ్ (సు.తా.) ఎవరికీ అన్యాయం చేయడు. చూడండి, **41:46**.

23. సత్యతిరస్కారులు అల్లాహ్ (సు.తా.) దృష్టిలో మానవులలోనే కాదు, జంతువులలో కూడా నీచాతినీచ జాతికిచెందిన వారు అని అర్థం.

ٱلَّذِينَ عَٰهَدتَّ مِنْهُمْ ثُمَّ يَنقُضُونَ عَهْدَهُمْ
فِى كُلِّ مَرَّةٍ وَهُمْ لَا يَتَّقُونَ ٥٦

56. వారిలో ఎవరితోనైతే నీవు ఒడంబడిక చేసుకున్నావో! వారు ప్రతిసారీ తమ ఒడంబడికను భంగపరుస్తున్నారు. మరియు వారికి దైవభీతి లేదు.[24]

فَإِمَّا تَثْقَفَنَّهُمْ فِى ٱلْحَرْبِ فَشَرِّدْ بِهِم مَّنْ خَلْفَهُمْ
لَعَلَّهُمْ يَذَّكَّرُونَ ٥٧

57. ఒకవేళ నీవు యుద్ధరంగంలో వారిపై ప్రాబల్యం పొందితే - వారి వెనుక ఉన్నవారు చెల్లాచెదరై పోయేటట్లుగా - వారిని శిక్షించు. బహుశా వారు గుణపాఠం నేర్చుకోవచ్చు!

وَإِمَّا تَخَافَنَّ مِن قَوْمٍ خِيَانَةً فَٱنۢبِذْ إِلَيْهِمْ
عَلَىٰ سَوَآءٍ ۚ إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْخَآئِنِينَ ٥٨

58. మరియు ఒకవేళ నీకు ఏ జాతి వారి వల్లనైనా నమ్మకద్రోహం జరుగుతుందనే భయం ఉంటే - మీరు ఇరుపక్షం వారు సరిసమానులని తెలుపటానికి[25] - (వారి ఒప్పందాన్ని) వారివైపుకు విసరివేయి. నిశ్చయంగా, అల్లాహ్ నమ్మకద్రోహులు అంటే ఇష్టపడడు.

وَلَا يَحْسَبَنَّ ٱلَّذِينَ كَفَرُوا۟ سَبَقُوٓا۟ ۚ إِنَّهُمْ
لَا يُعْجِزُونَ ٥٩

59. మరియు సత్యతిరస్కారులు, తాము తప్పించు కున్నామని భావించనవసరం లేదు. నిశ్చయంగా, వారు (అల్లాహ్ శిక్షనుండి) తప్పించుకోలేరు.

وَأَعِدُّوا۟ لَهُم مَّا ٱسْتَطَعْتُم مِّن قُوَّةٍ وَمِن
رِّبَاطِ ٱلْخَيْلِ تُرْهِبُونَ بِهِۦ عَدُوَّ ٱللَّهِ وَعَدُوَّكُمْ
وَءَاخَرِينَ مِن دُونِهِمْ لَا تَعْلَمُونَهُمُ ٱللَّهُ
يَعْلَمُهُمْ ۚ وَمَا تُنفِقُوا۟ مِن شَىْءٍ فِى سَبِيلِ ٱللَّهِ
يُوَفَّ إِلَيْكُمْ وَأَنتُمْ لَا تُظْلَمُونَ ٦٠

60. మరియు మీరు మీ శక్తిమేరకు బలసామాగ్రిని, యుద్ధపు గుర్రాలను సిద్ధపరచుకొని, దాని ద్వారా అల్లాహ్‌కు శత్రువులైన మీ శత్రువులను మరియు అల్లాహ్‌కు తెలిసి, మీకు తెలియని ఇతరులను కూడా భయకంపితులుగా చేయండి. మరియు అల్లాహ్ మార్గంలో మీరు ఏమి ఖర్చుచేసినా దానిఫలితం మీకు పూర్తిగా చెల్లించబడుతుంది. మరియు మీకెలాంటి అన్యాయం జరుగదు. **(1/8)**

---

24. కొందరు వ్యాఖ్యాతలు, వీరు బనూ ఖురైజహ్ అనే యూద తెగవారు అని అంటారు. కందక యుద్ధ కాలంలో వీరు సత్యతిరస్కారులకు సహాయపడమని దైవప్రవక్త ('స'అస)తో ఒడంబడిక చేసుకుంటారు. కాని వారు తమ ఒడంబడికకు కట్టుబడి ఉండరు. దీని మరొక భావం ఏమిటంటే ముస్లింలు, ఇతర ధర్మాల వారితో ఒప్పందాలు చేసుకొని వారితో శాంతియుతంగా నివసించడం, ధర్మ సమ్మతం మరియు యుక్తమైనది కూడాను. కాని వారు బహిరంగంగా విశ్వాసఘాతకానికి పూనుకుంటే వారితో పోరాడాలి.

25. 'అలా సవాఇన్: అంటే సరిసమానులని తెలుపటానికి. అంటే మీరు ఒడంబడికను త్రెంపి నందుకు మేము కూడా ఆ ఒడంబడికను త్రెంపుతున్నాము. ఇక మీదట ప్రతి ఒక్కరు తమ రక్షణకు తామే బాధ్యులని, స్పష్టం చేయటం.

وَإِنْ جَنَحُوا لِلسَّلْمِ فَاجْنَحْ لَهَا وَتَوَكَّلْ عَلَى
اللَّهِ ۚ إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿٦١﴾

61. * కాని ఒకవేళ వారు శాంతివైపుకు మొగ్గితే నీవు కూడా దానికి దిగు మరియు అల్లాహ్‌పై ఆధారపడు.[26] నిశ్చయంగా ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

وَإِنْ يُرِيدُوا أَنْ يَخْدَعُوكَ فَإِنَّ حَسْبَكَ اللَّهُ ۚ
هُوَ الَّذِي أَيَّدَكَ بِنَصْرِهِ وَبِالْمُؤْمِنِينَ ﴿٦٢﴾

62. కాని ఒకవేళ వారు నిన్ను మోసగించాలని సంకల్పిస్తే! నిశ్చయంగా, నీకు అల్లాహ్‌యే చాలు. ఆయనే తన సహాయం ద్వారా మరియు విశ్వాసుల ద్వారా నిన్ను బలపరుస్తాడు.

وَأَلَّفَ بَيْنَ قُلُوبِهِمْ ۚ لَوْ أَنْفَقْتَ مَا فِي الْأَرْضِ
جَمِيعًا مَا أَلَّفْتَ بَيْنَ قُلُوبِهِمْ وَلَٰكِنَّ اللَّهَ أَلَّفَ
بَيْنَهُمْ ۚ إِنَّهُ عَزِيزٌ حَكِيمٌ ﴿٦٣﴾

63. మరియు ఆయనే వారి (విశ్వాసుల) హృదయాలనుకలిపాడు. ఒకవేళ నీవు భూమిలో ఉన్న సమస్తాన్ని ఖర్చుచేసినా, వారి హృదయాలను కలుపజాలవు. కాని అల్లాహ్‌యే వారి మధ్య ప్రేమను కలిగించాడు.[27] నిశ్చయంగా ఆయన సర్వ శక్తి సంపన్నుడు, మహా వివేచనాపరుడు.

يَا أَيُّهَا النَّبِيُّ حَسْبُكَ اللَّهُ وَمَنِ اتَّبَعَكَ مِنَ
الْمُؤْمِنِينَ ﴿٦٤﴾

64. ఓ ప్రవక్తా! నీకూ మరియు నిన్ను అనుసరించే విశ్వాసులకు అల్లాహ్‌యే చాలు!

يَا أَيُّهَا النَّبِيُّ حَرِّضِ الْمُؤْمِنِينَ عَلَى الْقِتَالِ ۚ إِنْ
يَكُنْ مِنْكُمْ عِشْرُونَ صَابِرُونَ يَغْلِبُوا
مِائَتَيْنِ ۚ وَإِنْ يَكُنْ مِنْكُمْ مِائَةٌ يَغْلِبُوا أَلْفًا مِنَ
الَّذِينَ كَفَرُوا بِأَنَّهُمْ قَوْمٌ لَا يَفْقَهُونَ ﴿٦٥﴾

65. ఓ ప్రవక్తా! విశ్వాసులను యుద్ధానికి ప్రోత్సహించు. మీలో ఇరవైమంది స్థైర్యంగల వారుంటే, వారు రెండువందల మందిని జయించ గలరు. మరియు మీరు వందమంది ఉంటే వేయి మంది సత్యతిరస్కారులను జయించగలరు. ఎందు కంటే వారు (సత్యాన్ని) గ్రహించలేని జాతికి చెందినవారు.[28]

---

26. చూడండి, **47:35** మరియు **8:39**.

27. చూడండి, **3:103**. 'హునైన్ విజయధనం పంచేటప్పుడు ము'హమ్మద్ ('స'అస) మదీనా అన్సార్‌లను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి చూడండి, ('స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ అల్ మ'గా'జీ, బాబ్ 'గ'జ్వత్ అ'త్తాయ'ఫ్, 'స. ముస్లిం కితాబ్ అ'జ్జకాత్, బాబ్ ఇ'అతా' అల్ ముఅ'ల్లఫత్ ఖులూబుహుమ్ 'అలా అల్ ఇస్లాం).

28. చూడండి, **6:25, 7:179, 9:87**.

ٱلۡـَٔـٰنَ خَفَّفَ ٱللَّهُ عَنكُمۡ وَعَلِمَ أَنَّ فِيكُمۡ ضَعۡفٗاۚ فَإِن يَكُن مِّنكُم مِّاْئَةٞ صَابِرَةٞ يَغۡلِبُواْ مِاْئَتَيۡنِۚ وَإِن يَكُن مِّنكُمۡ أَلۡفٞ يَغۡلِبُوٓاْ أَلۡفَيۡنِ بِإِذۡنِ ٱللَّهِۗ وَٱللَّهُ مَعَ ٱلصَّٰبِرِينَ ٦٦

66. ఇప్పుడు అల్లాహ్ మీ భారాన్ని తగ్గించాడు, ఎందుకంటే వాస్తవానికి, మీలో బలహీనత ఉన్నదని ఆయనకు తెలుసు. కాబట్టి మీలో వందమంది స్థైర్యం గలవారు ఉంటే, వారు రెండువందల మందిని జయించగలరు. మరియు మీరు వేయిమంది ఉంటే, అల్లాహ్ సెలవుతో రెండువేల మందిని జయించగలరు. మరియు అల్లాహ్ సహనం గలవారితో ఉంటాడు.

مَا كَانَ لِنَبِيٍّ أَن يَكُونَ لَهُۥٓ أَسۡرَىٰ حَتَّىٰ يُثۡخِنَ فِي ٱلۡأَرۡضِۚ تُرِيدُونَ عَرَضَ ٱلدُّنۡيَا وَٱللَّهُ يُرِيدُ ٱلۡأٓخِرَةَۗ وَٱللَّهُ عَزِيزٌ حَكِيمٞ ٦٧

67. (శత్రువులతో తీవ్రంగా పోరాడి, వారిని) పూర్తిగా అణచనంతవరకు, తనవద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవటం, ధరణిలో ఏ ప్రవక్తకూ తగదు.[29] మీరు ప్రాపంచిక సామగ్రి కోరు తున్నారు. కాని అల్లాహ్ (మీకొరకు) పరలోక (సుఖాన్ని) కోరుతున్నాడు. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహావివేచనాపరుడు.

لَّوۡلَا كِتَٰبٞ مِّنَ ٱللَّهِ سَبَقَ لَمَسَّكُمۡ فِيمَآ أَخَذۡتُمۡ عَذَابٌ عَظِيمٞ ٦٨

68. ఒకవేళ అల్లాహ్ (ఫర్మానా) ముందే వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్నదానికి (నిర్ణయానికి) మీకు ఘోరశిక్ష విధించబడి ఉండేది.[30]

---

29. చూడండి, **47:4**. ఈ ఆయత్ సారాంశం ఏమిటంటే: ఎంతవరకైతే శత్రువులను హతమార్చి, వారిపై పూర్తిగా ప్రాబల్యాన్ని పొందరో, జయించరో! అంతవరకు, వారితో పోరాడి వారిని హతమార్చాలి వారి యుద్ధం చేయగల శక్తిని పూర్తిగా అంతమొందించాలి. ఆ తరువాతనే వారి యుద్ధఖైదీలను విమోచనాధనం తీసుకొని విడిచే విషయం గురించి ఆలోచించాలి, లేనిచో అవకాశం దొరకగానే వారు మిమ్మల్ని, నిర్మూలించటానికి ప్రయత్నించవచ్చు!

30. ఈ ఆయత్ **67**వ ఆయత్ తరువాత అవతరింపజేయబడింది. 'వ్రాయబడినమాట'ను గురించి వ్యాఖ్యాతలలో భేదాభిప్రాయాలున్నాయి. కొందరు ఇది విజయధనం అంటారు. అందుకే ఫిద్య తీసుకున్నా క్షమించబడ్డారు అంటారు. మరి కొందరు బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి 'పాపాలన్నీ క్షమించబడిన' విషయం అంటారు. మరికొందరు, దైవప్రవక్త వారిమధ్య ఉండటమే క్షమాపణకు కారణం అంటారు. బద్ర్‌యుద్ధంలో ఖైదీలైన **70** మంది ముష్రిక్ ఖురైషులను విమోచనాధనం (ఫిద్య) తీసుకుని విడిచిన తరువాత ఈ ఆయత్ మరియు దీని మునుపటి మరియు దీని తరువాత ఆయత్‌లు అవతరింపజేయబడ్డాయి. వివరాలకు చూడండి, ఫత్హ్ అల్-ఖదీర్.

فَكُلُوا مِمَّا غَنِمْتُمْ حَلَالًا طَيِّبًا ۚ وَاتَّقُوا اللَّهَ ۚ إِنَّ
اللَّهَ غَفُورٌ رَّحِيمٌ ٦٩

69. కావున మీకు ధర్మసమ్మతంగా లభించిన ఉత్తమమైన విజయధనాన్ని అనుభవించండి. అల్లాహ్‌యందు భయభక్తులు కలిగిఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

يَا أَيُّهَا النَّبِيُّ قُل لِّمَن فِي أَيْدِيكُم مِّنَ الْأَسْرَىٰ إِن
يَعْلَمِ اللَّهُ فِي قُلُوبِكُمْ خَيْرًا يُؤْتِكُمْ خَيْرًا مِّمَّا أُخِذَ
مِنكُمْ وَيَغْفِرْ لَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ٧٠

70. ఓ ప్రవక్తా! నీ అధీనంలో ఉన్న యుద్ధ ఖైదీలతో ఇలా అను: "ఒకవేళ అల్లాహ్ మీ హృదయాలలో మంచితనం చూస్తే ఆయన మీ వద్దనుండి తీసుకున్నదాని కంటే ఎంతో ఉత్తమమైన దానిని మీకు ప్రసాదించి ఉంటాడు. మరియు మిమ్మల్ని క్షమించి ఉంటాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత."[31]

وَإِن يُرِيدُوا خِيَانَتَكَ فَقَدْ خَانُوا اللَّهَ مِن قَبْلُ
فَأَمْكَنَ مِنْهُمْ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ٧١

71. కాని ఒకవేళ వారు నీకు నమ్మకద్రోహం చేయాలని తలచుకుంటే, వారు ఇంతకు పూర్వం అల్లాహ్‌కు నమ్మకద్రోహం చేశారు, కావున వారిపై నీకు శక్తినిచ్చాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేచనాపరుడు.

إِنَّ الَّذِينَ آمَنُوا وَهَاجَرُوا وَجَاهَدُوا بِأَمْوَالِهِمْ
وَأَنفُسِهِمْ فِي سَبِيلِ اللَّهِ وَالَّذِينَ آوَوا وَّنَصَرُوا
أُولَٰئِكَ بَعْضُهُمْ أَوْلِيَاءُ بَعْضٍ ۚ وَالَّذِينَ آمَنُوا
وَلَمْ يُهَاجِرُوا مَا لَكُم مِّن وَلَايَتِهِم مِّن شَيْءٍ
حَتَّىٰ يُهَاجِرُوا ۚ وَإِنِ اسْتَنصَرُوكُمْ فِي الدِّينِ
فَعَلَيْكُمُ النَّصْرُ إِلَّا عَلَىٰ قَوْمٍ بَيْنَكُمْ وَبَيْنَهُم
مِّيثَاقٌ ۗ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ٧٢

72. నిశ్చయంగా, విశ్వసించి వలసపోయే వారూ మరియు తమ సంపద మరియు ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారూ,[32] వారికి ఆశ్రయమిచ్చేవారూ మరియు సహాయం చేసే వారూ;[33] అందరూ ఒకరికొకరు మిత్రులు.[34] మరియు ఎవరైతే విశ్వసించి వలసపోలేదో వారు, వలసపోనంతవరకు వారి మైత్రిత్వంతో మీకు ఎలాంటి సంబంధం లేదు. కాని వారు ధర్మం విషయంలో మీతో సహాయం కోరితే, వారికి

---

31. చూడండి, 47:4.
32. వీరు వలసపోయిన 'స'హాబీలు, మొదటి శ్రేణివారు.
33. వీరు మదీనా ముస్లింలు (అన్సారులు), రెండవ శ్రేణివారు.
34. మౌలా: అంటే మిత్రుడు, స్నేహితుడు, సమర్థుడు, సహాయకుడు, సహకారుడు, ఆశ్రయమిచ్చే వాడు, సన్నిహితుడు, సంరక్షకుడు, స్వామి, బంధువు, కార్యకర్త, వారసుడు.

సహాయం చేయటం మీ కర్తవ్యం; కాని మీతో ఒడంబడిక ఉన్న జాతివారికి వ్యతిరేకంగా మాత్రం కాదు. మరియు అల్లాహ్ మీరు చేస్తున్నదంతా చూస్తున్నాడు.

وَالَّذِينَ كَفَرُوا بَعْضُهُمْ أَوْلِيَاءُ بَعْضٍ ۚ إِلَّا تَفْعَلُوهُ
تَكُن فِتْنَةٌ فِي الْأَرْضِ وَفَسَادٌ كَبِيرٌ ﴿٧٣﴾

73. మరియు సత్యతిరస్కారులు ఒకరి కొకరు స్నేహితులు. కావున (ఓ విశ్వాసులారా!) మీరు కూడా అలా చేయక (విశ్వాసుల మధ్య పరస్పర మైత్రిత్వాన్ని పెంచక) పోతే, భూమిలో ఉపద్రవం మరియు కల్లోలం చెలరేగుతాయి.

وَالَّذِينَ آمَنُوا وَهَاجَرُوا وَجَاهَدُوا فِي
سَبِيلِ اللَّهِ وَالَّذِينَ آوَوا وَّنَصَرُوا أُولَٰئِكَ هُمُ
الْمُؤْمِنُونَ حَقًّا ۚ لَّهُم مَّغْفِرَةٌ وَرِزْقٌ كَرِيمٌ ﴿٧٤﴾

74. మరియు ఎవరైతే విశ్వసించి వలస పోయి అల్లాహ్ మార్గంలో పోరాడారో వారూ మరియు ఎవరైతే వారికి ఆశ్రయమిచ్చి సహాయ పడ్డారో వారూ; ఇలాంటి వారే నిజమైన విశ్వాసులు. వారికి వారి (పాపాల) క్షమాపణ మరియు గౌరవప్రదమైన జీవనోపాధి ఉంటాయి.

وَالَّذِينَ آمَنُوا مِن بَعْدُ وَهَاجَرُوا وَجَاهَدُوا
مَعَكُمْ فَأُولَٰئِكَ مِنكُمْ ۚ وَأُولُو الْأَرْحَامِ بَعْضُهُمْ
أَوْلَىٰ بِبَعْضٍ فِي كِتَابِ اللَّهِ ۗ إِنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٧٥﴾

75. మరియు ఎవరైతే తరువాత విశ్వసించి మరియు వలసపోయి మరియు మీతోబాటు (అల్లాహ్ మార్గంలో) పోరాడారో, వారు కూడా మీ వారే! కాని అల్లాహ్ గ్రంథం ప్రకారం, రక్తసంబంధం గలవారు (వారసత్వ విషయంలో) ఒకరిపైనొకరు ఎక్కువ హక్కుదారులు.[35] నిశ్చయంగా అల్లాహ్‌కు ప్రతి విషయం గురించి బాగాతెలుసు. **(1/4)**

*****

35. విశ్వాసులు (ముస్లింలందరు) ఒకరికొకరు సహోదరులు, **49:10**. కాని వారసత్వపు విషయంలో ముస్లిం బంధువులే ఒకరికొకరు వారసులవుతారు. ఒక ముస్లిం అవిశ్వాసికి గానీ, లేక ఒక అవిశ్వాసి ముస్లింనకు గానీ వారసులు కాలేరు.

***

9. సూరహ్ అత్-తౌబహ్

سُورَةُ التَّوبَة

ఈ సూరహ్ ప్రారంభంలో, బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీం, లేదు. కొందరు దీనిని సూరహ్ అల్- అన్ఫాల్ యొక్క మిగతా భాగమని భావిస్తారు. ఇది మదీనాలో అవతరింపజేయబడింది. ఇందులో 129 ఆయతులు ఉన్నాయి. ఖుర్ఆన్‌లోని సబ'అ 'తవాలు, ఏడు పెద్ద సూరాలలో ఇది ఏడవది. ఈ రెండు సూరాహ్‌లలో కూడా సత్యతిరస్కారులతో జరిగిన యుద్ధాల వివరాలు ఉన్నాయి. ఈ సూరహ్ 9వ హిజ్రీ తబూక్ దండయాత్ర కాలపు విషయాలను వివరిస్తోంది. దీని పేరు, తబూక్ దండయాత్రకు వెళ్ళని కొందరు సహాబీల పశ్చాత్తాపం (తౌబహ్) మరియు దాని అంగీకారాన్ని సంబోధించి ఇవ్వబడింది. ఈ పదం 104వ ఆయత్‌లో ఉంది. ఇది సూరహ్ అల్- అన్ఫాల్ (8) అవతరణకు 7 సంవత్సరాల తరువాత అవతరింపజేయబడింది. ఇది సూరహ్ అల్ బరాఅ', అని కూడా అనబడుతుంది. ఈ పదం మొదటి ఆయత్‌లోనే ఉంది. బరాఅ'తున్ - అంటే విముక్తి, రాహిత్యం, సంబంధం లేకపోవటం. తబూక్ మదీనా నుండి 350 మైళ్ళ దూరంలో పశ్చిమోత్తరదిశలో ఉంది. బైజాన్‌టైన్ (Byzantine), క్రైస్తవ చక్రవర్తి హిరాక్లియస్ (Hiraclius), అబూ 'ఆమిర్, ప్రోత్సాహంవల్ల అరేబియాపై దాడి చేయటానికి సన్నాహాలు చేస్తున్నాడని తెలిసి, దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) వారిని తబూక్ దగ్గర ఎదుర్కోవాలని యుద్ధసన్నాహాల చాటింపుచేయించి, అక్కడికి వెళ్ళుతారు.

بَرَآءَةٌ مِّنَ اللّٰهِ وَرَسُوۡلِهٖۤ اِلَى الَّذِيۡنَ عٰهَدْتُّمْ مِّنَ الْمُشْرِكِيۡنَ ①

1. * అల్లాహ్ తరఫు నుండి మరియు ఆయన ప్రవక్త తరఫునుండి (ఓ విశ్వాసులారా!) మీరు ఒడంబడికచేసుకున్న బహుదైవారాధకులతో (ముష్రికీన్‌లతో) ఎలాంటి సంబంధం లేదు, అని ప్రకటించబడుతోంది.[1]

فَسِيۡحُوۡا فِى الْاَرْضِ اَرْبَعَةَ اَشْهُرٍ وَّاعْلَمُوۡۤا اَنَّكُمْ غَيْرُ مُعْجِزِى اللّٰهِ ۙ وَاَنَّ اللّٰهَ مُخْزِى الْكٰفِرِيۡنَ ②

2. కావున (ఓ ముష్రికులారా!) మీరు నాలుగు నెలల వరకు ఈ దేశంలో స్వేచ్ఛగా తిరగండి.[2] కాని మీరు అల్లాహ్ (శిక్ష) నుండి తప్పించుకోలేరని తెలుసుకోండి. మరియు నిశ్చయంగా, అల్లాహ్! సత్యతిరస్కారులను అవమానంపాలు చేస్తాడు.

---

1. బరాఅ'తున్: అంటే ఎట్టి సంబంధం లేదనటం. ఈ ఆయత్‌లు అవతరింపజేయబడినప్పుడు దైవప్రవక్త ('స'అస) 'అలీ (ర'ది.అ.ను) 9వ హిజ్రీ 'హజ్జ్ జనసమూహంలో ఈ విషయాలు ప్రకటించమని పంపారు: (1) ప్రజలు క'అబహ్ (బైతుల్లాహ్) చుట్టూ దింగబరులై ప్రదక్షిణ ('తవాఫ్) చేయకూడదు. (2) ఈ సంవత్సరం (9 హిజ్రీ) తరువాత ఏ ముష్రిక్ కూడా బైతుల్లాహ్ ('హజ్జ్)కు రాకూడదు, (3) ఏ అవిశ్వాసులతోనైతే ఒడంబడిక ఉందో, వారియెడల గడువు పూర్తిఅయ్యేవరకు విశ్వాసపాత్రంతో వ్యవహరించడం జరుగుతుంది. ('స. బు'ఖారీ మరియు 'స. ముస్లిం). ఆ 9వ హిజ్రీ 'హజ్జ్‌కు అబూబక్ర్ 'సిద్దీఖ్ (ర'ది. అ.) అమీర్‌గా ఉన్నారు.
2. చూడండి, 8:58. ఈ ఆయత్, ముస్లింలతో చేసిన ఒడంబడికను, త్రెంపిన ముష్రికులను ఉద్దేశించి ఉంది.

وَاَذَانٌ مِّنَ اللّٰهِ وَرَسُوْلِهٖۤ اِلَى النَّاسِ يَوْمَ الْحَجِّ الْاَكْبَرِ اَنَّ اللّٰهَ بَرِيْٓءٌ مِّنَ الْمُشْرِكِيْنَ ۙ۬ وَرَسُوْلُهٗ ؕ فَاِنْ تُبْتُمْ فَهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَاِنْ تَوَلَّيْتُمْ فَاعْلَمُوْۤا اَنَّكُمْ غَيْرُ مُعْجِزِى اللّٰهِ ؕ وَبَشِّرِ الَّذِيْنَ كَفَرُوْا بِعَذَابٍ اَلِيْمٍ ۙ﴿۳﴾

3. మరియు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త తరఫునుండి పెద్ద 'హజ్జ్,[3] రోజున సర్వ మానవజాతికి ప్రకటన చేయబడుతోంది: "నిశ్చయంగా, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు, బహుదైవారాధకులతో, ఎలాంటి సంబంధం లేదు. కావున మీరు (ఓ ముష్రికులారా!) పశ్చాత్తాపపడితే, అది మీ మేలుకే. కాని మీరు విముఖులైతే, మీరు అల్లాహ్ (శిక్ష) నుండి తప్పించుకోలేరని తెలుసుకోండి." మరియు సత్యతిరస్కారులకు బాధాకరమైన శిక్ష (విధించబడ)నున్నదనే వార్తను వినిపించు.

اِلَّا الَّذِيْنَ عٰهَدْتُّمْ مِّنَ الْمُشْرِكِيْنَ ثُمَّ لَمْ يَنْقُصُوْكُمْ شَيْـًٔا وَّلَمْ يُظَاهِرُوْا عَلَيْكُمْ اَحَدًا فَاَتِمُّوْۤا اِلَيْهِمْ عَهْدَهُمْ اِلٰى مُدَّتِهِمْ ؕ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُتَّقِيْنَ ﴿۴﴾

4. కాని ఏ బహుదైవారాధకులతోనైతే మీరు ఒడంబడికలు చేసుకొని ఉన్నారో, వారు మీకు ఏ విషయంలోను లోపం చేయక, మీకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయకుండా ఉంటే! వారి ఒడంబడికను దాని గడువువరకు పూర్తిచెయ్యండి. నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారిని ప్రేమిస్తాడు.

فَاِذَا انْسَلَخَ الْاَشْهُرُ الْحُرُمُ فَاقْتُلُوا الْمُشْرِكِيْنَ

5. ఇక నిషిద్ధమాసాలు[4] గడిచిపోయిన తరువాత బహుదైవారాధకులను, ఎక్కడ

---

3. *యౌమల్ 'హజ్జిల్ అక్బర్:* అంటే **10**వ జు'ల్ 'హజ్జ్ దినమని 'స'హీ'హ్ 'హదీస్'ల ద్వారా తెలుస్తుంది. ఎందుకంటే ఆ రోజు 'హాజీలకు చాలా మనాసిక్‌లను పూర్తిచేయవలసి ఉంటుంది. అది 'హజ్జె అ'స్గర్‌కు భిన్నపదం. అరేబియా వాసులు, 'ఉమ్రాను చిన్న హజ్జ్ ('హజ్జె అ'స్గర్) అనేవారు. దీనికి భిన్నంగా జు'ల్ 'హజ్జ్ మాసంలో జరిగేది పెద్ద హజ్జ్ (హ'జ్జె అక్బర్). **9**వ జు'ల్ 'హజ్జ్ శుక్రవారం రోజు వస్తే 'హజ్జె అక్బర్ అనే దానికి ఎలాంటి ఆధారం లేదు. ('స.బు'ఖారీ, నం. **4655**, 'స.ముస్లిం, నం. **982** మరియు తిర్మిజీ', నం. **957**.
4. హిజ్రీ శకంలోని *రజబ్, జు'ల్ ఖాయిదహ్, జు'ల్ 'హిజ్జహ్* మరియు ము'హర్రమ్ నెలలు నిషిద్ధమాసాలు. ఈ మాసాలలో యుద్ధం నిషిద్ధం. ఇది 'అరబ్బులలో ఇస్లాంకు ముందునుండి వస్తూఉన్న ఆచారం. చూడండి, **2:194, 217**. ఇబ్నె కసీ'ర్ (ర'హ్మ) ఇక్కడ (ఈ ఆయత్‌లో) నిషిద్ధమాసాలు అంటే ఈ ప్రకటనతరువాత నాలుగు నెలలు అంటే **10**వ జు'ల్ 'హిజ్జహ్ నుండి **10**వ రబీ'అ అత్తాని వరకు, అని అన్నారు.

حَيْثُ وَجَدْتُّمُوْهُمْ وَخُذُوْهُمْ وَاحْصُرُوْهُمْ وَاقْعُدُوْا لَهُمْ كُلَّ مَرْصَدٍ ۚ فَإِنْ تَابُوْا وَأَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ فَخَلُّوْا سَبِيْلَهُمْ ۚ إِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ⑤

దొరికితే అక్కడ వధించండి.[5] మరియు వారిని పట్టుకోండి[6] మరియు చుట్టుముట్టండి మరియు ప్రతి మాటువద్ద వారికై పొంచిఉండండి.[7] కాని వారు పశ్చాత్తాపపడి, నమా'జ్ స్థాపించి, 'జకాత్ ఇస్తే, వారిని వారిమార్గాన వదిలిపెట్టండి.[8] నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

وَإِنْ أَحَدٌ مِّنَ الْمُشْرِكِيْنَ اسْتَجَارَكَ فَأَجِرْهُ حَتّٰى يَسْمَعَ كَلٰمَ اللّٰهِ ثُمَّ أَبْلِغْهُ مَأْمَنَهٗ ۚ ذٰلِكَ بِأَنَّهُمْ قَوْمٌ لَّا يَعْلَمُوْنَ ⑥

6. మరియు బహుదైవారాధకులలో (ముష్రికీన్‌లలో) ఎవడైనా నీ శరణుకోరితే, అతడు అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) వినటానికి అతడికి శరణు ఇవ్వు. తరువాత అతడిని, అతడి కొరకు సురక్షితమైన స్థలానికి చేర్చు. ఇది ఎందుకంటే! వాస్తవానికి, వారు (సత్యం) తెలియని ప్రజలు.[9]

---

5. 'హరమ్ సరిహద్దులలో కేవలం వారితోనే పోరాడాలి ఎవరైతే మీపై దాడిచేస్తారో! చూడండి, 2:190-194, (ఇబ్నె కసీ'ర్). మీతో యుద్ధం చేసేవారితో అల్లాహ్ (సు.తా.) మార్గంలో పోరాడండి. ఎవరైతే మీతో విరోధాలు చేయరో, వారితో పోరాడవద్దు. జిహాద్ అంటే, మీరు ముస్లింలు అయిఉండి, ఇతరులకు శాంతియుతంగా ఏక దైవసిద్ధాంతం, సత్యధర్మం అయిన ఇస్లాంను బోధిస్తూ ఉంటే, మీ మార్గంలో ఆటంకాలు పెడుతూ, మీ ధన, మాన, ప్రాణాలకు హాని గలిగించగోరేవారితో, వారు మానుకునే వరకు, లేదా నిర్మూలించబడే వరకు చేసే ధర్మయుద్ధం. చూడండి, **4:91**. అంటే ఆత్మ సంరక్షణ కొరకు చేసే పోరాటం జిహాద్. చూడండి, **60:8-9**.

6. ఖైదీలుగా చేసుకొనండి.

7. వారి రాకపోకడలపై కాపలా పెట్టండి. మీ అనుమతి లేనిదే వారిని కదలనివ్వకండి. వారి నివాస స్థలాలను కాపెట్టుకొని ఉండండి.

8 . చూడండి, **2:256**. 'ధర్మ విషయంలో బలవంతం లేదు.' అంటే ఎవ్వరినీ కూడా ఇస్లాం స్వీకరించటానికి బలవంతం చేయకూడదు.

9. పై ఆయత్ మీతో యుద్ధం చేస్తున్న సత్యతిరస్కారుల విషయంలో అవతరింపజేయబడింది. ఈ విరోధులైన సత్యతిరస్కారులలో ఎవడైనా మీ శరణు కోరితే అతనికి శరణు ఇవ్వండి. అతడు మీతో ఉండి మీ మంచితనాన్ని మరియు ఇస్లాంను దగ్గరనుండి చూసి ఖుర్ఆన్‌ను విని ముస్లిం కావచ్చు. అతడు ఖుర్ఆన్‌ను విన్నతరువాత కూడా ఇస్లాం స్వీకరించకుంటే అతనిని, అతనికి భద్రతనిచ్చే స్థలానికి పంపండి. అతడు ముస్లిం కాకున్నా సరే. మీరిచ్చిన శరణపు ప్రతిజ్ఞను పూర్తిచేసుకోండి. అతడు తన భద్రతాస్థలానికి చేరేంతవరకు వాని ప్రాణరక్షణ మీ బాధ్యత.

كَيۡفَ يَكُوۡنُ لِلۡمُشۡرِكِيۡنَ عَهۡدٌ عِنۡدَ اللّٰهِ وَعِنۡدَ رَسُوۡلِهٖۤ اِلَّا الَّذِيۡنَ عٰهَدۡتُّمۡ عِنۡدَ الۡمَسۡجِدِ الۡحَـرَامِ‌ۚ فَمَا اسۡتَقَامُوۡا لَـكُمۡ فَاسۡتَقِيۡمُوۡا لَهُمۡ‌ؕ اِنَّ اللّٰهَ يُحِبُّ الۡمُتَّقِيۡنَ ۝٧

7. బహుదైవారాధకులకు ((ముష్రికీన్‌లకు) అల్లాహ్‌తో మరియు ఆయన ప్రవక్తతో ఒడంబడిక ఎలా సాధ్యం కాగలదు? మస్జిద్ అల్ 'హరామ్ వద్ద మీరు ఒడంబడిక చేసుకున్న వారితో తప్ప! వారు తమ (ఒడంబడికపై) స్థిరంగా ఉన్నంత వరకు మీరు కూడా దానిపై స్థిరంగా ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారిని ప్రేమిస్తాడు.

كَيۡفَ وَاِنۡ يَّظۡهَرُوۡا عَلَيۡكُمۡ لَا يَرۡقُبُوۡا فِيۡكُمۡ اِلًّا وَّلَا ذِمَّةً‌ ؕ يُرۡضُوۡنَكُمۡ بِاَفۡوَاهِهِمۡ وَتَاۡبٰى قُلُوۡبُهُمۡ‌ۚ وَاَكۡثَرُهُمۡ فٰسِقُوۡنَ‌ۚ ۝٨

8. (వారితో ఒడంబడిక) ఎలా సాధ్యం కాగలదు? ఎందుకంటే వారు మీపై ప్రాబల్యం వహిస్తే, వారు మీ బంధుత్వాన్ని గానీ, ఒడం బడికను గానీ పాటించరు. వారు కేవలం నోటి మాటలతోనే మిమ్మల్ని సంతోష పరుస్తున్నారు, కాని వారి హృదయాలు మాత్రం మిమ్మల్ని అసహ్యించుకుంటున్నాయి మరియు వారిలో అనేకులు అవిధేయులు (ఫాసిఖూన్) ఉన్నారు.

اِشۡتَرَوۡا بِاٰيٰتِ اللّٰهِ ثَمَنًا قَلِيۡلًا فَصَدُّوۡا عَنۡ سَبِيۡلِهٖ‌ؕ اِنَّهُمۡ سَآءَ مَا كَانُوۡا يَعۡمَلُوۡنَ ۝٩

9. వారు అల్లాహ్ సూక్తులను (ఆయాత్‌లను) అల్పధరకు విక్రయించి, ప్రజలను ఆయన మార్గం నుండి ఆటంకపరుస్తున్నారు. నిశ్చయంగా వారు చేసే పనులు ఎంతో నీచమైనవి!

لَا يَرۡقُبُوۡنَ فِىۡ مُؤۡمِنٍ اِلًّا وَّلَا ذِمَّةً‌ ؕ وَاُولٰۤـئِكَ هُمُ الۡمُعۡتَدُوۡنَ ۝١٠

10. వారు ఏ విశ్వాసి విషయంలో కూడా బంధుత్వాన్ని గానీ, ఒడంబడికను గానీ పాటించరు! ఇటువంటి వారే, హద్దులను అతిక్రమించిన వారు.

فَاِنۡ تَابُوۡا وَاَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ فَاِخۡوَانُكُمۡ فِى الدِّيۡنِ‌ ؕ وَنُفَصِّلُ الۡاٰيٰتِ لِقَوۡمٍ يَّعۡلَمُوۡنَ ۝١١

11. కావున వారు పశ్చాత్తాపపడి, నమా'జ్ స్థాపించి, 'జకాత్ ఇస్తే! వారు మీ ధార్మిక సోదరులు. మరియు తెలుసుకోగల వారికి, మేము మాసూచనలను,ఈ విధంగా స్పష్టపరుస్తున్నాము.

وَإِن نَّكَثُوٓا أَيْمَٰنَهُم مِّنۢ بَعْدِ عَهْدِهِمْ وَطَعَنُوا فِى دِينِكُمْ فَقَٰتِلُوٓا أَئِمَّةَ ٱلْكُفْرِ ۙ إِنَّهُمْ لَآ أَيْمَٰنَ لَهُمْ لَعَلَّهُمْ يَنتَهُونَ ﴿١٢﴾

12. మరియు వారు ఒడంబడిక చేసిన తరువాత మళ్ళీ తమ ప్రమాణాలను భంగం చేస్తే! మరియు మీ ధర్మాన్ని అవమానపరిస్తే, అలాంటి సత్యతిరస్కారుల నాయకులతో మీరు యుద్ధంచేయండి. నిశ్చయంగా, వారి ప్రమాణాలు నమ్మదగినవి కావు. బహుశా ఈ విధంగానైనా వారు మానుకోవచ్చు![10]

أَلَا تُقَٰتِلُونَ قَوْمًا نَّكَثُوٓا أَيْمَٰنَهُمْ وَهَمُّوا بِإِخْرَاجِ ٱلرَّسُولِ وَهُم بَدَءُوكُمْ أَوَّلَ مَرَّةٍ ۚ أَتَخْشَوْنَهُمْ ۚ فَٱللَّهُ أَحَقُّ أَن تَخْشَوْهُ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿١٣﴾

13. ఏమీ? ఎవరైతే తమ ప్రమాణాలను భంగంచేసి, సందేశహరుణ్ణి (మక్కానుండి) వెడలగొట్టాలని నిర్ణయించారో! మరియు మొదట వారే, మీతో తగవు ఆరంభించారో,[11] అలాంటివారితో మీరు యుద్ధంచేయరా? ఏమీ? మీరు వారికి భయపడుతున్నారా? వాస్తవానికి మీరు విశ్వాసులే అయితే, కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడటం మీకర్తవ్యం.

قَٰتِلُوهُمْ يُعَذِّبْهُمُ ٱللَّهُ بِأَيْدِيكُمْ وَيُخْزِهِمْ وَيَنصُرْكُمْ عَلَيْهِمْ وَيَشْفِ صُدُورَ قَوْمٍ مُّؤْمِنِينَ ﴿١٤﴾

14. వారితో యుద్ధం చేయండి. అల్లాహ్ మీ చేతులద్వారా వారిని శిక్షిస్తాడు మరియు వారిని అవమానంపాలు చేస్తాడు. మరియు వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు. మరియు విశ్వసించినప్రజల హృదయాలను చల్లబరుస్తాడు;

وَيُذْهِبْ غَيْظَ قُلُوبِهِمْ ۗ وَيَتُوبُ ٱللَّهُ عَلَىٰ مَن يَشَآءُ ۗ وَٱللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿١٥﴾

15. మరియు వారి హృదయాలలోని క్రోధాన్ని దూరంచేస్తాడు. మరియు అల్లాహ్! తాను కోరిన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

---

10. ఎవరైతే ఒడంబడిక చేసిన తరువాత తమ ఒడంబడికలను భంగం చేస్తారో మరియు మీ ధర్మాన్ని అవమానపరుస్తారో, అలాంటి సత్యతిరస్కారులతో యుద్ధం చేయండి.

11. బహుశా ఇక్కడ ఖురైషులు తమ ఒడంబడికకు విరుద్ధంగా బనీ-ఖు'జా'అ వారిని చంపటానికి, బనీ-బక్ర్ వారికి తోడ్పడిన విషయం పేర్కొనబడింది. బనీ-ఖు'జా'అ ముస్లింల హలీఫ్‌లు, మరియు బనీ-బక్ర్ ఖురైషుల హలీఫ్‌లు. దైవప్రవక్త ('స'అస) మరియు మక్కా ముష్రిక్ ఖురైషుల మధ్య: 'పది సంవత్సరాల వరకు - వారి మధ్య మరియు వారి హలీఫ్‌లతో కూడా - యుద్ధం చేయకూడదు మరియు వారితో పోరాడే వారికి సహాయం కూడా చేయరాదు.' అనే, ఒడంబడిక ఉండెను. ఇది 6వ హిజ్రీలో హుదైబియాలోజరిగిన ఒడంబడిక.

اَمۡ حَسِبۡتُمۡ اَنۡ تُتۡرَكُوۡا وَلَمَّا يَعۡلَمِ اللّٰهُ الَّذِيۡنَ جٰهَدُوۡا مِنۡكُمۡ وَلَمۡ يَتَّخِذُوۡا مِنۡ دُوۡنِ اللّٰهِ وَلَا رَسُوۡلِهٖ وَلَا الۡمُؤۡمِنِيۡنَ وَلِيۡجَةً‌ ؕ وَاللّٰهُ خَبِيۡرٌۢ بِمَا تَعۡمَلُوۡنَ ﴿۱۶﴾

16. ఏమీ? అల్లాహ్ మీలోనుండి (తన మార్గంలో) పోరాడేవారెవరో మరియు - అల్లాహ్, ఆయన ప్రవక్త మరియు విశ్వాసులు తప్ప - ఇతరుల నెవ్వరినీ తమ ఆప్తమిత్రులుగా చేసుకోనివారెవరో, తెలుసుకోనిదే మిమ్మల్ని వదలిపెడతాడని అనుకుంటున్నారా? మరియు అల్లాహ్ మీరు చేస్తున్నదంతా బాగాఎరుగును.

مَا كَانَ لِلۡمُشۡرِكِيۡنَ اَنۡ يَّعۡمُرُوۡا مَسٰجِدَ اللّٰهِ شٰهِدِيۡنَ عَلٰٓى اَنۡفُسِهِمۡ بِالۡكُفۡرِ‌ ؕ اُولٰٓـئِكَ حَبِطَتۡ اَعۡمَالُهُمۡ ۖۚ وَفِى النَّارِ هُمۡ خٰلِدُوۡنَ ﴿۱۷﴾

17. బహుదైవారాధకులు (ముష్రికీన్), తాము సత్యతిరస్కారులమని సాక్ష్యమిస్తూ, అల్లాహ్ మస్జిదులను నిర్వహించటానికి (సేవచేయటానికి) అర్హులుకారు. అలాంటి వారి కర్మలు వ్యర్థమైపోతాయి మరియు వారు నరకాగ్నిలో శాశ్వతంగా ఉంటారు.

اِنَّمَا يَعۡمُرُ مَسٰجِدَ اللّٰهِ مَنۡ اٰمَنَ بِاللّٰهِ وَالۡيَوۡمِ الۡاٰخِرِ وَاَقَامَ الصَّلٰوةَ وَاٰتَى الزَّكٰوةَ وَلَمۡ يَخۡشَ اِلَّا اللّٰهَ‌ فَعَسٰۤى اُولٰٓـئِكَ اَنۡ يَّكُوۡنُوۡا مِنَ الۡمُهۡتَدِيۡنَ ﴿۱۸﴾

18. నిశ్చయంగా అల్లాహ్‌ను అంతిమదినాన్ని విశ్వసించేవారు, నమా'జ్‌ను స్థాపించేవారు, 'జకాత్ ఇచ్చే వారు, అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ భయపడనివారు మాత్రమే అల్లాహ్ మస్జిద్‌లను నిర్వహించాలి. ఇలాంటివారే మార్గదర్శకత్వం పొందినవారని ఆశించవచ్చు![12] **(3/8)**

اَجَعَلۡتُمۡ سِقَايَةَ الۡحَآجِّ وَعِمَارَةَ الۡمَسۡجِدِ الۡحَـرَامِ كَمَنۡ اٰمَنَ بِاللّٰهِ وَالۡيَوۡمِ الۡاٰخِرِ وَجٰهَدَ فِىۡ سَبِيۡلِ اللّٰهِ‌ ؕ لَا يَسۡتَوٗنَ عِنۡدَ اللّٰهِ‌ ؕ وَاللّٰهُ لَا يَهۡدِى الۡقَوۡمَ الظّٰلِمِيۡنَ‌ۘ ﴿۱۹﴾

19. * ఏమీ? 'హజ్జ్ మరియు 'ఉమ్రా కొరకు వచ్చే వారికి నీరు త్రాపటాన్ని మరియు మస్జిద్ అల్'హరామ్‌ను నిర్వహించటాన్ని, మీరు అల్లాహ్‌ను మరియు అంతిమదినాన్ని విశ్వసించి, అల్లాహ్ మార్గంలో పోరాడే దానికి సమానంగా భావిస్తున్నారా? అల్లాహ్ దగ్గర, వారు (ఈ రెండు పక్షాలవారు) సరిసమానులు కారు.[13] మరియు

---

12. దైవప్రవక్త (స'అస) ప్రవచనం: 'ఒకవేళ మీరు ఒక వ్యక్తిని సక్రమంగా మస్జిద్‌కు వస్తూ ఉండేది చూస్తే, అతని విశ్వాసానికి సాక్ష్యం ఇవ్వండి.' (తిర్మిజీ', తఫ్సీర్ 'సూ. అత్ తౌబహ్). ఖుర్ఆన్‌లో ఇక్కడ కూడా అల్లాహ్(సు.తా.)ను అంతిమదినాన్ని విశ్వసించిన తరువాత చేయ వలసిన పనులలో నమా'జ్, దాని తరువాత 'జకాత్ అని పేర్కొనబడ్డాయి. మరొక 'హదీస్' ముత్తఫిఖ్ అలైహి ఉంది. అబూ బక్ర్ 'సిద్దీఖ్ (ర'ది. 'అ.) అన్నారు: 'అల్లాహ్ తోడు, నేను అలాంటి వారితో తప్పక పోరాడుతాను, ఎవరైతే నమా'జ్ మరియు 'జకాత్‌ల మధ్య భేదం చూపుతారో!' అంటే నమా'జ్ చేస్తారు కాని 'జకాత్ ఇవ్వడానికి వెనుకంజవేస్తారో! (చూడండి, **9:5**).

13. ఈ ఆయత్ అవతరింపజేయబడిన సందర్భాన్ని గురించి, 'స'హాబా (ర'ది.'అన్హుమ్)ల మధ్య

అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు సన్మార్గంచూపడు.

ٱلَّذِينَ ءَامَنُوا۟ وَهَاجَرُوا۟ وَجَٰهَدُوا۟ فِى
سَبِيلِ ٱللَّهِ بِأَمْوَٰلِهِمْ وَأَنفُسِهِمْ أَعْظَمُ دَرَجَةً
عِندَ ٱللَّهِ ۚ وَأُو۟لَٰٓئِكَ هُمُ ٱلْفَآئِزُونَ ٢٠

20. విశ్వసించి, అల్లాహ్‌మార్గంలో వలస పోయిన వారికీ మరియు తమ ధనసంపత్తులను ప్రాణాలను వినియోగించి పోరాడినవారికీ, అల్లాహ్ దగ్గర అత్యున్నత స్థానముంది. మరియు అలాంటి వారే సాఫల్యం (విజయం) పొందేవారు.[14]

يُبَشِّرُهُمْ رَبُّهُم بِرَحْمَةٍ مِّنْهُ وَرِضْوَٰنٍ وَجَنَّٰتٍ
لَّهُمْ فِيهَا نَعِيمٌ مُّقِيمٌ ٢١

21. వారి ప్రభువు వారికి, తన తరఫునుండి కారుణ్యాన్ని మరియు ప్రసన్నతను మరియు శాశ్వత సౌఖ్యాలుగల స్వర్గవనాల శుభవార్తను ఇస్తున్నాడు.

خَٰلِدِينَ فِيهَآ أَبَدًا ۚ إِنَّ ٱللَّهَ عِندَهُۥٓ أَجْرٌ
عَظِيمٌ ٢٢

22. వారందులో శాశ్వతంగా కలకాలం ఉంటారు. నిశ్చయంగా అల్లాహ్ దగ్గర గొప్ప ప్రతిఫలముంది.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تَتَّخِذُوٓا۟ ءَابَآءَكُمْ
وَإِخْوَٰنَكُمْ أَوْلِيَآءَ إِنِ ٱسْتَحَبُّوا۟ ٱلْكُفْرَ عَلَى
ٱلْإِيمَٰنِ ۚ وَمَن يَتَوَلَّهُم مِّنكُمْ فَأُو۟لَٰٓئِكَ هُمُ
ٱلظَّٰلِمُونَ ٢٣

23. ఓ విశ్వాసులారా! మీ తండ్రితాతలు మరియు మీ సోదరులు సత్యతిరస్కారానికి విశ్వాసంపై ప్రాధాన్యతనిస్తే, మీరు వారిని స్నేహితులుగా చేసుకోకండి. మీలో వారివైపు మొగ్గేవారే (వారిని మీ స్నేహితులుగా చేసుకునే వారే) దుర్మార్గులు.[15]

మస్జిదె నబవీలో శుక్రవారం మింబర్ దగ్గర జరిగిన ఈ సంభాషణ కారణం అంటారు. ఒక 'సహాబీ (ర'ది.'అ.) అంటారు: "నేను ఇస్లాం స్వీకరించిన తరువాత నా దృష్టిలో అన్నిటి కంటే ఉత్తమమైన కార్యం 'హాజీలకు 'జమ్'జమ్ త్రాపడం." రెండో అతను అంటారు: "నా దగ్గర మస్జిద్ అల్'హరాం సేవచేయడం." మూడవ అతను అంటారు: "అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్ చేయడం." ఈ 'హదీస్' కథకుడు నూమాన్ బిన్ బషీర్ (ర'ది.'అ.) నేను ఆరోజు జుమ'అహ్ నమా'జ్ తరువాత వెళ్ళి దైవప్రవక్త ('స'అస)కు ఈ విషయం తెలిపాను. అప్పుడు ఈఆయత్ అవతరింపజేయబడింది, ('స'హీ'హ్ ముస్లిం, *కితాబ్ అల్ఇమారహ్, బాబ్ ఫ'జ్ల్ అష్షహాదహ్ ఫీ సబీలిల్లాహ్*). అల్లాహ్ (సు.తా.)ను అంతిమదినాన్ని విశ్వసించిన తరువాతనే అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్ స్వీకరించబడుతుంది. ఈమాన్ లేనిదే ఎంత గొప్ప కార్యం చేసినా దాని ఫలితం శూన్యమే. విశ్వాసుని జిహాద్ సర్వకార్యాలలో గొప్పది. ఈ విషయం దీని తరువాత ఉన్న ఆయత్‌లో స్పష్టంగా ఉంది.

14. చూడండి, 'స. బు'ఖారీ, పు **4**, 'హ. **48, 54**.

15. హిజ్‌రత్ మరియు జిహాద్ విషయంలో మీరు, మీ సోదరుల మరియు తండ్రుల ప్రేమను రానివ్వకండి. వారు మీ స్నేహితులు కాలేరు. వారు మీతో మంచిగా వ్యవహరిస్తే, మిమ్మల్ని మీ ఇస్లాం ధర్మాన్ని పాటించటంనుండి ఆపకుంటే, వారితో మంచిగా వ్యవహరించండి. కాని వారు మిమ్మల్ని ఇస్లాం కొరకే బాధిస్తే, వారిని మీ స్నేహితులుగా భావించకండి. (చూ. **3:28, 60:8-9**).

قُلْ إِن كَانَ آبَاؤُكُمْ وَأَبْنَاؤُكُمْ وَإِخْوَانُكُمْ وَأَزْوَاجُكُمْ وَعَشِيرَتُكُمْ وَأَمْوَالٌ اقْتَرَفْتُمُوهَا وَتِجَارَةٌ تَخْشَوْنَ كَسَادَهَا وَمَسَاكِنُ تَرْضَوْنَهَا أَحَبَّ إِلَيْكُم مِّنَ اللَّهِ وَرَسُولِهِ وَجِهَادٍ فِي سَبِيلِهِ فَتَرَبَّصُوا حَتَّىٰ يَأْتِيَ اللَّهُ بِأَمْرِهِ ۗ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْفَاسِقِينَ ﴿٢٤﴾

24. వారితో ఇలా అను: "మీ తండ్రితాతలు, మీ కుమారులు, మీ సోదరులు, మీ సహవాసులు (అ'జ్వాజ్), మీ బంధువులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయేమోనని భయపడే మీ వ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీ భవనాలు - అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్తకంటే మరియు ఆయన మార్గంలో పోరాడటంకంటే - మీకు ఎక్కువ ప్రియమైనవైతే, అల్లాహ్ తన తీర్పును బహిర్గతం చేసేవరకు నిరీక్షించండి. మరియు అల్లాహ్ అవిధేయులైన జాతివారికి సన్మార్గంచూపడు."[16]

لَقَدْ نَصَرَكُمُ اللَّهُ فِي مَوَاطِنَ كَثِيرَةٍ ۙ وَيَوْمَ حُنَيْنٍ ۙ إِذْ أَعْجَبَتْكُمْ كَثْرَتُكُمْ فَلَمْ تُغْنِ عَنكُمْ شَيْئًا وَضَاقَتْ عَلَيْكُمُ الْأَرْضُ بِمَا رَحُبَتْ ثُمَّ وَلَّيْتُم مُّدْبِرِينَ ﴿٢٥﴾

25. వాస్తవానికి ఇదివరకు చాలా యుద్ధ రంగాలలో (మీరు కొద్దిమంది ఉన్నా) అల్లాహ్ మీకు విజయం చేకూర్చాడు. మరియు 'హునైన్ (యుద్ధం) రోజు మీ సంఖ్యాబలం మీకు గర్వ కారణమయింది. కాని, అది మీకు ఏ విధంగానూ పనికిరాలేదు. మరియు భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకైపోయింది. తరువాత మీరు వెన్నుచూపి పారిపోయారు.[17]

---

16. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఎవరిచేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ (సు.తా.) తోడు. మీలో ఏ ఒక్కడు కూడా ముఅ'మిన్ కాజాలడు, ఎంత వరకైతే అతడు తన తండ్రి, తన సంతానం మరియు ఇతరులందరికంటే, నన్ను ('స'అస) ఎక్కువగా ప్రేమించడో!" ('స'హీ'హ్ బు'ఖారీ, *కితాబ్ అల్ ఈమాన్, బాబ్ 'హుబ్బె రసూల్ ('స'అస) మినల్ ఈమాన్; 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అల్ ఈమాన్*).

17. 'హునైన్, మక్కా మరియు 'తాయఫ్‌ల మధ్య పర్వతాలలో ఉన్న ఒక లోయ (వాది). అక్కడ హవా'జిన్ మరియు స'ఖీఫ్ అనే రెండు తెగలవారు ఉండేవారు. వారు విలువిద్యలో నిపుణులు. వారు ముస్లింలకు విరుద్ధంగా పోరాడటానికి, యుద్ధ తయారీలు చేస్తున్నారని తెలుసుకొని దైవప్రవక్త ('స'అస), **12,000** సైనికులతో, మక్కా విజయపు **18-19** దినాల తరువాత **8**వ హిజ్రీ, షవ్వాల్ నెలలోవారిపై దాడిచేయడానికి వెళ్ళారు. ముస్లింలకు తమ సంఖ్యాబలం కొంతవరకు గర్వానికి కారణమవుతుంది. ఇది అల్లాహ్(సు.తా.)కు నచ్చదు. శత్రువులు దాదాపు **4,000** మంది ఉంటారు. శత్రువుల బాణాల దెబ్బలకు తాళుకోలేక ముస్లిం సైనికులు వెనుదిరిగి పారిపోసాగుతారు. కేవలం దైవప్రవక్త ('స'అస), కొందరు ముస్లింలతో బాటు మిగిలిపోతారు. దైవప్రవక్త ('స'అస) పారిపోయే వారిని ఆపటానికి కేకలువేస్తారు. తరువాత అతను ('స'అస) 'అబ్బాస్ (ర'ది.'అ.)తో వారిని పిలవమని అంటారు. అతను పెద్దపెద్ద కేకలు వేయుటంవల్ల, సిగ్గుపడి కొందరు తిరిగి వస్తారు. ఆ ఉన్న వారే ధైర్యస్థైర్యాలతో యుద్ధంచేసి అల్లాహ్ (సు.తా.) అనుగ్రహంతో విజయం పొందుతారు. శత్రువులు తమ ఆస్తిపాస్తులన్నీ విడిచి పారిపోతారు.

26. తరువాత అల్లాహ్ తన ప్రవక్తపై మరియు విశ్వాసులపై ప్రశాంతస్థితిని అవతరింపజేశాడు. మరియు మీకు కనిపించని (దైవదూతల) దళాలను దింపి సత్య తిరస్కారులను శిక్షించాడు.[18] మరియు ఇదే సత్యతిరస్కారులకు లభించే ప్రతిఫలం.

ثُمَّ أَنزَلَ اللَّهُ سَكِينَتَهُ عَلَىٰ رَسُولِهِ وَعَلَى
الْمُؤْمِنِينَ وَأَنزَلَ جُنُودًا لَّمْ تَرَوْهَا وَعَذَّبَ
الَّذِينَ كَفَرُوا ۚ وَذَٰلِكَ جَزَاءُ الْكَافِرِينَ ﴿٢٦﴾

27. ఆ తరువాత కూడా అల్లాహ్ తాను కోరిన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

ثُمَّ يَتُوبُ اللَّهُ مِن بَعْدِ ذَٰلِكَ عَلَىٰ مَن
يَشَاءُ ۗ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿٢٧﴾

28. ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, బహు దైవారాధకులు (ముష్రికీన్) అపరిశుద్ధులు (నజ్స్).[19] కనుక ఈసంవత్సరం తరువాత వారు మస్జిద్ అల్ 'హరామ్ సమీపానికి రాకూడదు.[20] మరియు ఒకవేళ మీరు లేమికి భయపడితే! అల్లాహ్ కోరితే, తన అనుగ్రహంతో మిమ్మల్ని సంపన్నులుగా చేయగలడు! నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేచనాపరుడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّمَا الْمُشْرِكُونَ نَجَسٌ
فَلَا يَقْرَبُوا الْمَسْجِدَ الْحَرَامَ بَعْدَ عَامِهِمْ
هَٰذَا ۚ وَإِنْ خِفْتُمْ عَيْلَةً فَسَوْفَ يُغْنِيكُمُ اللَّهُ
مِن فَضْلِهِ إِن شَاءَ ۚ إِنَّ اللَّهَ عَلِيمٌ حَكِيمٌ ﴿٢٨﴾

29. అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించని; అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించినవి,నిషిద్ధమనిభావించని;సత్యధర్మాన్ని తమ ధర్మంగా స్వీకరించని గ్రంథ ప్రజలతో -

قَاتِلُوا الَّذِينَ لَا يُؤْمِنُونَ بِاللَّهِ وَلَا بِالْيَوْمِ
الْآخِرِ وَلَا يُحَرِّمُونَ مَا حَرَّمَ اللَّهُ
وَرَسُولُهُ وَلَا يَدِينُونَ دِينَ الْحَقِّ مِنَ
الَّذِينَ أُوتُوا الْكِتَابَ حَتَّىٰ يُعْطُوا

---

18. కనిపించనిదళాలను అంటే దైవదూతలను, అల్లాహ్ (సు.తా.) పంపాడు. ఏ విధంగానైతే ఉ'హుద్ యుద్ధంలో, (చూడండి, **3:124-125**) మరియు బద్ర్ యుద్ధంలో (చూడండి, **8:9**), పంపాడో!

19 . నజసున్: అంటే అవిశ్వాసులు, అశుచులు, అశుభ్రులు, అపరిశుద్ధులు, మురికివారు, మాలిన్యులు, కల్మషులు అనే అర్థాలున్నాయి. ఈ అపరిశుద్ధత శారీరకంగా గానీ, లేక మానసికంగా గానీ, లేక రెండూ గానీ కావచ్చు. శారీరకంగా ఎందుకంటే వారు లైంగిక లేక కాలకృత్యాల అపరిశుద్ధత తరువాత విధిగా పరిశుద్ధత అవలంబిచక పోవడం. మానసికంగా, ఎందుకంటే వారు ఏకైక ఆరాధ్యుడు, సర్వసృష్టి కర్త, సర్వపోషకుడు అయిన అల్లాహ్ (సు.తా.)ను వదలి ఇతరులను ఏమీ చేయలేని వారిని అల్లాహ్ (సు.తా.)కు సాటి కల్పించడం. ఈ శబ్దం ఖుర్ఆన్‌లో ఈ ఆయత్‌లోనే ఒకేసారి వచ్చింది.

20. ముస్లిమేతరులు 'హరమ్ సరిహద్దులలోకి రాకూడదు. ఈ ఆజ్ఞ **9**వ హిజ్రీలో వచ్చింది. కాని వారు ఇతర మస్జిద్‌లలో ప్రవేశించవచ్చు. ఉదాహరణకు దైవప్రవక్త ('స'అస) స'మామ బిన్ ఆసా'ల్ (ర'ది.'అ.)ను, అతడు ఇస్లాం స్వీకరించక ముందు మస్జిద్ అన్ నబవీలో ఒక స్తంభానికి ఖైదీగా కట్టిఉంచారు.

الْجِزْيَةَ عَنْ يَدٍ وَهُمْ صٰغِرُوْنَ ﴿٢٩﴾

వారు స్వయంగా తమ చేతులతో జి'జ్యా[21] ఇచ్చి లోబడిఉండేవరకూ పోరాడండి.[22]

وَقَالَتِ الْيَهُوْدُ عُزَيْرُ ابْنُ اللّٰهِ وَقَالَتِ النَّصٰرَى الْمَسِيْحُ ابْنُ اللّٰهِ ذٰلِكَ قَوْلُهُمْ بِاَفْوَاهِهِمْ يُضَاهِـُٔوْنَ قَوْلَ الَّذِيْنَ كَفَرُوْا مِنْ قَبْلُ قَاتَلَهُمُ اللّٰهُ اَنّٰى يُؤْفَكُوْنَ ﴿٣٠﴾

30. మరియు యూదులు 'ఉ'జైర్ అల్లాహ్ కుమారుడని[23] అంటారు మరియు క్రైస్తవులు మసీ'హ్ (క్రీస్తు) అల్లాహ్ కుమారుడని. ఇవి వారు తమ నోటితో అనే మాటలే. ఇంతకు పూర్వపు సత్యతిరస్కారులు పలికిన మాటలనే వారు అనుకరిస్తున్నారు. అల్లాహ్ వారిని నశింప జేయుగాక! వారెంత మోసగింపబడుతున్నారు (సత్యంనుండి మరలింపబడుతున్నారు)!

اِتَّخَذُوْٓا اَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ اَرْبَابًا مِّنْ دُوْنِ اللّٰهِ وَالْمَسِيْحَ ابْنَ مَرْيَمَ وَمَآ اُمِرُوْٓا اِلَّا لِيَعْبُدُوْٓا اِلٰهًا وَّاحِدًا لَآ اِلٰهَ اِلَّا هُوَ سُبْحٰنَهٗ عَمَّا يُشْرِكُوْنَ ﴿٣١﴾

31. వారు (యూదులు మరియు క్రైస్తవులు) అల్లాహ్‌ను వదలి తమ యూదమతాచారులు (అ'హ్‌బార్)లను మరియు (క్రైస్తవ) సన్యాసులను (రుహ్‌బాన్‌లను) మరియు మర్యమ్ కుమారుడైన మసీ'హ్ (క్రీస్తు)ను తమ ప్రభువులుగా చేసు కున్నారు.[24] వాస్తవానికివారు ఒకే ఒక్క దైవాన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడ్డారు. ఆయన(అల్లాహ్)తప్పమరొక ఆరాధ్య దైవం లేడు. ఆయన వారు సాటికల్పించే వాటికి అతీతుడు.

---

21. జి'జ్‌యతున్: ఖుర్ఆన్‌లో ఇచ్చట ఒకేసారివచ్చింది. జి'జ్‌యాఅంటే, ముస్లిమేతరులతో ఇస్లామీయ ప్రభుత్వం వసూలుచేసే పన్ను. దీనికి కారణాలు: (**1**) వారు విధిగా 'జకాత్ చెల్లించరు, (**2**) వారికి ఇస్లామియా ప్రభుత్వంలో జిహాద్, అంటే ఇస్లాం ధర్మ రక్షణకొరకు పోరాడటం విధికాదు, (**3**) వారి ఆత్మరక్షణ ఖర్చుకొరకు.
ఈ క్రింద పేర్కొన్న వారికి జి'జ్‌యాలేదు. (**1**) స్త్రీలు, (**2**) యుక్తవయస్సుకు రాని పురుషులు, (**3**) వృద్ధులు, (**4**) వ్యాధిగ్రస్తులు మరియు వికలాంగులు, (**5**) ధర్మవేత్తలు, గురువులు, మునులు, (**6**) ఎవరైతే జిహాద్ (మిలటరీ డ్యూటీ) కొరకు సిద్ధపడతారో వారు.

22. జిహాద్‌ను ఈ విధంగా కూడా వివరించారు: అల్లాహ్ (సు.తా.) మార్గంలో పోరాడటం, అంటే సత్యాన్ని మరియు దానిని అనుసరించే వారిని (ముస్లింలను) రక్షించటానికి చేసే ధర్మయుద్ధం. ఇది ప్రతి ముస్లిం యొక్క విధి. (చూడండి, **2:190-194**).

23. బాబిలోనియన్‌లు (Babylonians) యూదులను, వెడలగొట్టిన తరువాత వారు (యూదులు) తౌరాత్‌ను కోల్పోయారు. అది ఈ రోజు ఉన్న స్థితిలోకి, దానిని తిరిగి తెచ్చినవారు 'ఉ'జైర్ 'అ.స. (Ezra). అతనే ఈ రోజు ఆచారంలో ఉన్న యూదమతాన్ని స్థాపించారు, (Encyclopedia Brittanica, **1963, vol 9, p.15**). అతనినే యూదులు అల్లాహుతా'ఆలా కుమారుడంటారు.

24. చూడండి, **3:64**.

يُرِيدُونَ اَنْ يُّطْفِـُٔوْا نُوْرَ اللّٰهِ بِاَفْوَاهِهِمْ وَيَاْبَى اللّٰهُ اِلَّآ اَنْ يُّتِمَّ نُوْرَهٗ وَلَوْ كَرِهَ الْكٰفِرُوْنَ ۝٣٢

32. వారు అల్లాహ్ జ్యోతిని (ఇస్లాంను) తమ నోటితో (ఊది) ఆర్పగోరుతున్నారు, కాని అల్లాహ్ అలా కానివ్వడు; సత్యతిరస్కారులకు అది ఎంత అసహ్యాకరమైనా, ఆయన తన జ్యోతిని పూర్తిచేసి (ప్రసరింపజేసి) తీరుతాడు.

هُوَ الَّذِيْٓ اَرْسَلَ رَسُوْلَهٗ بِالْهُدٰى وَدِيْنِ الْحَقِّ لِيُظْهِرَهٗ عَلَى الدِّيْنِ كُلِّهٖ ۙ وَلَوْ كَرِهَ الْمُشْرِكُوْنَ ۝٣٣

33. బహుదైవారాధకులకు (ముష్రికీన్‌లకు) అది ఎంత అసహ్యాకరమైనా, తనప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ మరియు సత్యధర్మాన్నీ ఇచ్చి పంపి, దానిని సకల ధర్మాల మీద ప్రబలింపజేసినవాడు (ఆధిక్యతనిచ్చినవాడు) ఆయన (అల్లాహ్)యే![25] **(1/2)**

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنَّ كَثِيْرًا مِّنَ الْاَحْبَارِ وَالرُّهْبَانِ لَيَاْكُلُوْنَ اَمْوَالَ النَّاسِ بِالْبَاطِلِ وَيَصُدُّوْنَ عَنْ سَبِيْلِ اللّٰهِ ۗ وَالَّذِيْنَ يَكْنِزُوْنَ الذَّهَبَ وَالْفِضَّةَ وَلَا يُنْفِقُوْنَهَا فِيْ سَبِيْلِ اللّٰهِ ۙ فَبَشِّرْهُمْ بِعَذَابٍ اَلِيْمٍ ۝٣٤

34. * ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, చాలా మంది యూద మతాచారులు (అ'హ్బార్) మరియు క్రైస్తవ సన్యాసులు (రుహ్బాన్) ప్రజల సొత్తును అక్రమ పద్ధతులద్వారా తినివేస్తున్నారు మరియు వారిని అల్లాహ్ మార్గంనుండి ఆటంకపరుస్తున్నారు. మరియు ఎవరైతే వెండి బంగారాన్ని కూడబెట్టి, దానిని అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టరో వారికి బాధాకరమైన శిక్ష గలదనే వార్తను వినిపించు.

يَّوْمَ يُحْمٰى عَلَيْهَا فِيْ نَارِ جَهَنَّمَ فَتُكْوٰى بِهَا جِبَاهُهُمْ وَجُنُوْبُهُمْ وَظُهُوْرُهُمْ ۗ هٰذَا مَا كَنَزْتُمْ لِاَنْفُسِكُمْ فَذُوْقُوْا مَا كُنْتُمْ تَكْنِزُوْنَ ۝٣٥

35. ఆ దినమున దానిని (ఆ వెండి బంగారాన్ని) నరకాగ్నిలో కాల్చి దానితో వారి నుదురులమీద, ప్రక్కలమీద మరియు వీపులమీద వాతలు వేయబడతాయి.[26] (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది): "ఇదంతా మీరు మీ కొరకు కూడబెట్టుకున్నదే, కావున మీరు కూడబెట్టుకున్న దానిని చవిచూడండి."

---

25. చూడండి, **3:19** మరియు **61:8-9**.

26. చూడండి, **3:180** ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-**2**, 'హదీస్' నెం. **486**.

اِنَّ عِدَّةَ الشُّهُوْرِ عِنْدَ اللّٰهِ اثْنَا عَشَرَ شَهْرًا فِیْ كِتٰبِ اللّٰهِ یَوْمَ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ مِنْهَاۤ اَرْبَعَةٌ حُرُمٌ ؕ ذٰلِكَ الدِّیْنُ الْقَیِّمُ ۙ۬ فَلَا تَظْلِمُوْا فِیْهِنَّ اَنْفُسَكُمْ وَقَاتِلُوا الْمُشْرِكِیْنَ كَآفَّةً كَمَا یُقَاتِلُوْنَكُمْ كَآفَّةً ؕ وَاعْلَمُوْۤا اَنَّ اللّٰهَ مَعَ الْمُتَّقِیْنَ ۝٣٦

36. నిశ్చయంగా, నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర పన్నెండునెలలు మాత్రమే. ఇది భూమ్యాకాశాలు సృష్టించిన దినంనుండి అల్లాహ్ గ్రంథంలో వ్రాయ బడి ఉంది. వాటిలో నాలుగు నిషిద్ధ (మాసాలు).[27] ఇదే సరైన ధర్మం. కావున వాటిలో (ఆ నాలుగు హి౛్రీ మాసాలలో) మీకు మీరు అన్యాయం చేసుకోకండి.[28] బహుదైవారాధ కులతో (ముష్రికీన్ లతో) అందరూ కలిసి పోరాడండి. ఏ విధంగా అయితే వారందరూ కలిసి మీతో పోరాడు తున్నారో! మరియు నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారితోనే ఉంటాడని తెలుసుకోండి.[29]

اِنَّمَا النَّسِیْٓءُ زِیَادَةٌ فِی الْكُفْرِ یُضَلُّ بِهِ الَّذِیْنَ كَفَرُوْا یُحِلُّوْنَهٗ عَامًا وَّیُحَرِّمُوْنَهٗ عَامًا لِّیُوَاطِـُٔوْا عِدَّةَ مَا حَرَّمَ اللّٰهُ فَیُحِلُّوْا مَا حَرَّمَ اللّٰهُ ؕ زُیِّنَ لَهُمْ سُوْٓءُ اَعْمَالِهِمْ ؕ وَاللّٰهُ لَا یَهْدِی الْقَوْمَ الْكٰفِرِیْنَ ۝٣٧

37. నిశ్చయంగా, నెలలను వెనుక ముందు చేయటం (నసీఉ') సత్యతిరస్కారంలో అదనపు చేష్టయే! దానివల్ల సత్యతిరస్కారులు మార్గ భ్రష్టత్వానికి గురిచేయబడుతున్నారు. వారు దానిని ఒక సంవత్సరం ధర్మసమ్మతం చేసుకుంటారు, మరొక సంవత్సరం నిషేధించుకుంటారు. ఈ విధంగా వారు అల్లాహ్ నిషేధించిన (నెలల) సంఖ్యను తమకు అనుగుణంగా మార్చుకొని అల్లాహ్ నిషేధించిన

---

27. నిషిద్ధమాసాలు హి౛్రీ శకపు *రజబ్, జు'ల్-ఖాయిదహ్, జు'ల్-'హిజ్జహ్* మరియు *ము'హర్రమ్* (**7,11,12** మరియు **1**వ నెలలు).

28. హి౛్రీ నెలల లెక్క చంద్రుని నెలప్రకారం ఉంది. అంటే హి౛్రీ సంవత్సరం చాంద్రమాన సంవత్సరం. ఇవి ప్రకృతిసిద్ధమైన నెలలు మరియు సంవత్సరాలు. వీటిని అనుసరించటానికి లెక్కలు పెట్టే అవసరం లేదు. దీనివల్ల రమ'దాన్ ఉపవాసాలు మరియు 'హజ్జ్ వేరువేరు ఋతువులలో వస్తాయి. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ప్రజలు ప్రతి ఋతువులో ఉపవాసాలు, పండుగలు చేసుకుంటారు. చాంద్రనెల **29.5** రోజులది మరియు చాంద్ర సంవత్సరం **354** రోజులది. సూర్యమాన సంవత్సరంతో ఇది **11.25** రోజులు తక్కువ. దీని వల్ల ప్రతి **34** చాంద్రమాన సంవత్సరాలకు అంటే **12,036** దినాలకు ఒకసారి 'హజ్జ్ అదే దినమున మళ్ళీ వస్తుంది. ముష్రిక్ అరబ్బులు, చాంద్ర మాన సంవత్సరాన్ని సూర్య మాన సంవత్సరంతో సరిపెట్ట టానికి అధికమాసాన్ని చేర్చే వారు. ఈ ఆయత్ తరువాత ఇస్లాం షరీయత్‌లో సూర్యమాన సంవత్సరం మరియు అలా సరిపెట్టటం రద్దు చేయబడ్డాయి.

29. చూడండి, **2:193, 8:73**.

దానిని ధర్మసమ్మతం చేసుకుంటున్నారు. వారి దుష్కార్యాలు వారికి మనోహరమైనవిగా కనిపిస్తున్నాయి. మరియు అల్లాహ్ సత్య తిరస్కారులకు సన్మార్గం చూపడు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ مَا لَكُمْ إِذَا قِيلَ لَكُمُ ٱنفِرُوا۟
فِى سَبِيلِ ٱللَّهِ ٱثَّاقَلْتُمْ إِلَى ٱلْأَرْضِ ۚ أَرَضِيتُم
بِٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا مِنَ ٱلْءَاخِرَةِ ۚ فَمَا مَتَٰعُ ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا
فِى ٱلْءَاخِرَةِ إِلَّا قَلِيلٌ ﴿٣٨﴾

38. ఓ విశ్వాసులారా! మీకేమయింది? మీతో: "అల్లాహ్ మార్గంలో బయలుదేరండి." అని చెప్పినపుడు మీరు భూమికి అతుక్కొని పోతున్నారేమిటి? ఏమీ? మీరు పరలోకాన్ని వదలి, ఇహలోక జీవితంతోనే తృప్తిపడదలచుకున్నారా? కాని ఇహలోకజీవిత సుఖం, పరలోక (జీవిత సుఖాలముందు) ఎంతో అల్పమైనది![30]

إِلَّا تَنفِرُوا۟ يُعَذِّبْكُمْ عَذَابًا أَلِيمًا وَيَسْتَبْدِلْ
قَوْمًا غَيْرَكُمْ وَلَا تَضُرُّوهُ شَيْـًٔا ۗ وَٱللَّهُ عَلَىٰ كُلِّ
شَىْءٍ قَدِيرٌ ﴿٣٩﴾

39. మీరు బయలుదేరకపోతే, ఆయన మీకు బాధాకరమైన శిక్షను విధిస్తాడు. మరియు మీకు బదులుగా మరొక జాతిని మీ స్థానంలో తెస్తాడు. మరియు మీరు ఆయనకు ఎలాంటి నష్టం కలిగించ లేరు.[31] మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

إِلَّا تَنصُرُوهُ فَقَدْ نَصَرَهُ ٱللَّهُ إِذْ أَخْرَجَهُ ٱلَّذِينَ
كَفَرُوا۟ ثَانِىَ ٱثْنَيْنِ إِذْ هُمَا فِى ٱلْغَارِ إِذْ
يَقُولُ لِصَٰحِبِهِۦ لَا تَحْزَنْ إِنَّ ٱللَّهَ مَعَنَا ۖ
فَأَنزَلَ ٱللَّهُ سَكِينَتَهُۥ عَلَيْهِ وَأَيَّدَهُۥ بِجُنُودٍ لَّمْ
تَرَوْهَا وَجَعَلَ كَلِمَةَ ٱلَّذِينَ كَفَرُوا۟ ٱلسُّفْلَىٰ ۗ وَكَلِمَةُ
ٱللَّهِ هِىَ ٱلْعُلْيَا ۗ وَٱللَّهُ عَزِيزٌ حَكِيمٌ ﴿٤٠﴾

40. ఒకవేళ మీరు అతనికి (ప్రవక్తకు) సహాయంచేయకపోతే ఏంఫర్వాలేదు! (అల్లాహ్ అతనికి తప్పక సహాయం చేస్తాడు). ఏ విధంగానైతే, సత్యతిరస్కారులు అతనిని పారద్రోలినపుడు, అల్లాహ్ అతనికి సహాయం చేశాడో! అప్పుడతను ఇద్దరిలో రెండవ వాడిగా (సౌ'ర్) గుహలో ఉన్నప్పుడు అతను తన తోటి వానితో (అబూ బక్ర్‌తో): "నీవు దుఃఖపడకు, నిశ్చయంగా అల్లాహ్ మనతో ఉన్నాడు!" అని

---

30. చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-4, 'హదీస్' నెం. 53.

31. ఇక్కడ 9వ హిజ్రీ షవ్వాల్ నెలలో జరిగిన తబూక్ దండయాత్ర ప్రస్తావన ఉంది. బెజాంటైన్ (Byzantine) చక్రవర్తి, క్రైస్తవుడైన, హిరాక్లియస్, ముస్లింలకు విరుద్ధంగా యుద్ధసన్నాహాలు మొదలుపెట్టాడు. కావున ము'హమ్మద్ ('స'అస) కూడా యుద్ధసన్నాహాలు మొదలుపెట్టారు. అది కపటవిశ్వాసులకు ఎంతో బాధకరంగా ఉంటుంది. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడింది. దైవప్రవక్త ('స'అస) ముస్లింలతో, క్రైస్తవులను ఎదుర్కోవటానికి తబూక్ వెళ్ళి, అక్కడ 20 రోజులుండి, క్రైస్తవులు యుద్ధానికి రానందుకు తిరిగి వచ్చేస్తారు.

అన్నాడు.[32] అప్పుడు అల్లాహ్! అతనిపై తనతరఫునుండి మనశ్శాంతిని అవతరింప జేశాడు. అతనిని మీకు కనిపించని (దైవదూతల) దళాలతో సహాయంచేసి సత్యతిరస్కారుల మాటను కించపరచాడు. మరియు అల్లాహ్ మాట సదా సర్వోన్నతమైనదే. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహావివేచనాపరుడు.

انْفِرُوا خِفَافًا وَّثِقَالًا وَّجَاهِدُوا بِأَمْوَالِكُمْ
وَأَنفُسِكُمْ فِي سَبِيلِ اللَّهِ ۚ ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ إِن
كُنتُمْ تَعْلَمُونَ ﴿٤١﴾

41. తేలికగానైనా సరే, లేక బరువుగానైనా సరే బయలుదేరండి. మరియు మీ సంపదలతో మరియు మీ ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడండి. ఒకవేళ మీరిది తెలుసుకోగలిగితే, ఇది మీకెంతో ఉత్తమమైనది.

لَوْ كَانَ عَرَضًا قَرِيبًا وَّسَفَرًا قَاصِدًا
لَّاتَّبَعُوكَ وَلَٰكِن بَعُدَتْ عَلَيْهِمُ الشُّقَّةُ ۚ
وَسَيَحْلِفُونَ بِاللَّهِ لَوِ اسْتَطَعْنَا لَخَرَجْنَا
مَعَكُمْ يُهْلِكُونَ أَنفُسَهُمْ ۚ وَاللَّهُ يَعْلَمُ
إِنَّهُمْ لَكَاذِبُونَ ﴿٤٢﴾

42. అది తొందరగా దొరికే లాభం మరియు సులభమైన ప్రయాణం అయితే వారు తప్పక నీ వెంట వెళ్ళేవారు. కాని వారికది (తబూక్ ప్రయాణం) చాలా కష్టమైనదిగా (దూరమైనదిగా) అనిపించింది. కావున వారు అల్లాహ్‌పై ప్రమాణం చేస్తూ అంటున్నారు: "మేము రాగలస్థితిలో ఉంటే తప్పక మీవెంట వచ్చిఉండేవారము." (ఈ విధంగా అబద్ధమాడి) వారు తమను తాము నాశనం చేసుకుంటున్నారు. మరియు వారు అబద్ధమాడుతున్నారని అల్లాహ్‌కు బాగా తెలుసు.[33]

---

32. క్రీ. శకం **622**, (ప్రవక్త పదవి ప్రసాదించబడిన దాదాపు **13**వ సంవత్సరం)లో, ము'హమ్మద్ ('స'అస)ను చంపటానికి, మక్కా ముష్రికులు అతని ఇంటి మీదికి, రాత్రివేళ ప్రతి తెగనుండి ఒక యువకుణ్ణి తయారుచేసి పంపుతారు. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో, దైవప్రవక్త ('స'అస) వారి మీద దుమ్ము విసరగా, వారికి కునుకు వస్తుంది. ఆ తరువాత అతను ('స'అస), అబూబక్ర్ (ర'ది.'అ.)తో సహా బయలుదేరి, సౌ'ర్ కొండ గుహలో మూడురోజులు దాగుతారు. ముష్రికులు వారిని వెతుక్కుంటూ గుహపై వరకు చేరుతారు. కాని ముష్రికులు వారిద్దరిని కనుగొనలేక పోతారు. అది వారిద్దరు గమనిస్తారు. ఆసందర్భంలో దైవప్రవక్త ('స'అస) అబూబక్ర్ (ర'ది.'అ.)తో ఈ మాటలు అంటారు, ('స'హీ'హ్ బు'ఖారీ).

33. ఎండకాలం, ఖర్జూర పంటకాలం, చాలా దూరపు ప్రయాణం కావటం వల్ల కపటవిశ్వాసులు, బలహీన విశ్వాసం గలవారు, మరికొందరు ఎడారి వాసు(బద్దూ)లు, ఎన్నో బూటక సాకులు చెప్పి దైవప్రవక్త ('స'అస)ను, వెనుక ఉండి పోవటానికి అనుమతి అడుగుతారు. దైవప్రవక్త ('స'అస) అనుమతి కూడా ఇస్తారు. ఆసందర్భంలో ఇది మరియు దీనితరువాత ఆయతులు అవతరింప జేయబడ్డాయి.

عَفَا اللّٰهُ عَنْكَ ۚ لِمَ اَذِنْتَ لَهُمْ حَتّٰى
يَتَبَيَّنَ لَكَ الَّذِيْنَ صَدَقُوْا وَتَعْلَمَ
الْكٰذِبِيْنَ ﴿٤٣﴾

43. (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నిన్ను మన్నించు గాక! సత్యవంతులెవరో నీకు స్పష్టం కాకముందే మరియు అబద్ధమాడేవారెవరో నీకు తెలియకముందే, వారిని (వెనుకఉండటానికి) ఎందుకు అనుమతినిచ్చావు?[34]

لَا يَسْتَاْذِنُكَ الَّذِيْنَ يُؤْمِنُوْنَ بِاللّٰهِ
وَالْيَوْمِ الْاٰخِرِ اَنْ يُّجَاهِدُوْا بِاَمْوَالِهِمْ
وَاَنْفُسِهِمْ ؕ وَاللّٰهُ عَلِيْمٌۢ بِالْمُتَّقِيْنَ ﴿٤٤﴾

44. అల్లాహ్‌ను మరియు అంతిమదినాన్ని విశ్వసించేవారు, తమ సంపత్తి మరియు తమ ప్రాణాలను వినియోగించి (అల్లాహ్‌మార్గంలో) పోరాడటం నుండి తప్పించుకోవటానికి ఎన్నడూ అనుమతి అడగరు. మరియు దైవభీతి గలవారు ఎవరో అల్లాహ్‌కు బాగా తెలుసు.

اِنَّمَا يَسْتَاْذِنُكَ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِاللّٰهِ
وَالْيَوْمِ الْاٰخِرِ وَارْتَابَتْ قُلُوْبُهُمْ فَهُمْ فِيْ
رَيْبِهِمْ يَتَرَدَّدُوْنَ ﴿٤٥﴾

45. నిస్సందేహంగా, అల్లాహ్‌ను మరియు అంతిమదినాన్ని విశ్వసించని వారే, వెనుక ఉండటానికి అనుమతి అడుగుతారు. మరియు వారి హృదయాలు సందేహంలో మునిగి ఉన్నాయి. కావున వారు తమ సందేహాలలో పడి ఊగిసలాడుతున్నారు.[35] (5/8)

وَلَوْ اَرَادُوا الْخُرُوْجَ لَاَعَدُّوْا لَهٗ عُدَّةً
وَّلٰكِنْ كَرِهَ اللّٰهُ انْۢبِعَاثَهُمْ فَثَبَّطَهُمْ
وَقِيْلَ اقْعُدُوْا مَعَ الْقٰعِدِيْنَ ﴿٤٦﴾

46. * మరియు ఒకవేళ వారు బయలు దేరాలని కోరిఉంటే తప్పక దానికై వారు యుద్ధసామగ్రిని సిద్ధపరచుకొని ఉండేవారు, కాని వారు బయలుదేరటం అల్లాహ్‌కు ఇష్టం లేదు, కావున వారిని నిలిపివేశాడు. మరియు వారితో: "కూర్చొని ఉన్నవారితో మీరు కూడా కూర్చొనిఉండండి!" అని చెప్పబడింది.

---

34. చూడండి, **24:62**.

35. ఈ జిహాద్‌లో పాల్గొనే విషయంలో ముస్లింల నాలుగు వర్గాలు ఏర్పడ్డాయి: **(1)** సహృదయంతో వెంటనే జిహాద్‌కుసిద్ధపడ్డవారు; **(2)**మొదటసంకోచించి వెంటనేసిద్ధపడ్డవారు; **(3)**వృద్ధులు, రోగులు మరియు ప్రయాణపు ఖర్చులులేనివారు వీరిని అల్లాహ్ (సు.తా.) క్షమించాడు. చూడండి, **9:91-92; (4)** కేవలం సోమరి తనంవల్ల పాల్గొననివారు. వీరు పశ్చాత్తాపపడి క్షమాపణకోరగా వారిక్షమాపణ తరువాత అంగీక రించబడుతుంది. వీరుగాక బూటక సాకులు చెప్పి వెనుకఉండిపోయిన కపట విశ్వాసులు కూడా ఉన్నారు.

لَوْ خَرَجُوا فِيكُمْ مَّا زَادُوكُمْ إِلَّا
خَبَالًا وَّلَأَوْضَعُوا خِلَالَكُمْ
يَبْغُونَكُمُ الْفِتْنَةَ وَفِيكُمْ
سَمَّاعُونَ لَهُمْ ۗ وَاللَّهُ عَلِيمٌ بِالظَّالِمِينَ ﴿٤٧﴾

47. ఒకవేళ వారు మీతో కలిసి వెళ్ళినా మీలో కలతలు తప్ప మరేమీ అధికం చేసేవారు కాదు. మరియు మీ మధ్య ఉపద్రవం (ఫిత్న) రేకెత్తించటానికి తీవ్ర ప్రయత్నాలు చేసేవారు. మరియు మీలో కొందరు వారికొరకు (కపట విశ్వాసులకొరకు) మాటలు వినేవారు (వారి గూఢాచారులు) ఉన్నారు. మరియు అల్లాహ్‌కు దుర్మార్గుల గురించి బాగా తెలుసు.

لَقَدِ ابْتَغَوُا الْفِتْنَةَ مِن قَبْلُ وَقَلَّبُوا لَكَ
الْأُمُورَ حَتَّىٰ جَاءَ الْحَقُّ وَظَهَرَ أَمْرُ اللَّهِ
وَهُمْ كَارِهُونَ ﴿٤٨﴾

48. (ఓ ప్రవక్తా!) వాస్తవానికి వారు ఇంతకు ముందు కూడా కల్లోలాన్ని (ఫిత్నను) పుట్టించి, నీ కార్యాలను తలక్రిందులు చేయగోరారు. చివరకు సత్యం బహిర్గతమయింది. మరియు అల్లాహ్ నిర్ణయం స్పష్టమయ్యింది. మరియు వారు దీన్ని అసహ్యించుకున్నారు!

وَمِنْهُم مَّن يَقُولُ ائْذَن لِّي وَلَا تَفْتِنِّي ۚ
أَلَا فِي الْفِتْنَةِ سَقَطُوا ۗ وَإِنَّ جَهَنَّمَ
لَمُحِيطَةٌ بِالْكَافِرِينَ ﴿٤٩﴾

49. మరియు వారిలో: "నాకు (వెనుక ఉండటానికి) అనుమతినివ్వు! నన్ను ఏ మాత్రం పరీక్షకు గురిచేయకు!" అని అనే వారు కూడా ఉన్నారు. వాస్తవానికి, వారు (ఇలా అనుమతికోరి) పరీక్షకు గురిఅయ్యారు! మరియు నిశ్చయంగా, సత్యతిరస్కారులను నరకాగ్ని చుట్టుకోనున్నది.

إِن تُصِبْكَ حَسَنَةٌ تَسُؤْهُمْ ۖ وَإِن تُصِبْكَ
مُصِيبَةٌ يَقُولُوا قَدْ أَخَذْنَا أَمْرَنَا مِن
قَبْلُ وَيَتَوَلَّوا وَّهُمْ فَرِحُونَ ﴿٥٠﴾

50. (ఓ ప్రవక్తా!) ఒకవేళ నీకు మేలుకలిగితే వారికిబాధకలుగుతుంది.మరియు నీపై ఆపద వస్తే వారు: "మేము ముందుగానే జాగ్రత్త పడ్డాము!" అని అంటూ సంతోషపడుతూ మరలిపోతారు.

قُل لَّن يُصِيبَنَا إِلَّا مَا كَتَبَ اللَّهُ لَنَا هُوَ
مَوْلَانَا ۚ وَعَلَى اللَّهِ فَلْيَتَوَكَّلِ
الْمُؤْمِنُونَ ﴿٥١﴾

51. వారితో ఇలా అను: "అల్లాహ్ మా కొరకు వ్రాసింది తప్ప మరేమీ మాకు సంభవించదు. ఆయనే మా సంరక్షకుడు. మరియు విశ్వాసులు అల్లాహ్ మీదే నమ్మకం ఉంచుకోవాలి!"

قُلْ هَلْ تَرَبَّصُونَ بِنَا إِلَّا إِحْدَى
الْحُسْنَيَيْنِ ۖ وَنَحْنُ نَتَرَبَّصُ بِكُمْ أَن
يُصِيبَكُمُ اللَّهُ بِعَذَابٍ مِّنْ عِندِهِ أَوْ
بِأَيْدِينَا ۖ فَتَرَبَّصُوا إِنَّا مَعَكُم مُّتَرَبِّصُونَ ﴿٥٢﴾

52. ఇలా అను: "మీరు మా విషయంలో నిరీక్షిస్తున్నది రెండు మేలైనవాటిలో ఒకటి. అల్లాహ్ స్వయంగా మీకు శిక్ష విధిస్తాడా, లేదా మా చేతుల ద్వారానా? అని మేము నిరీక్షిస్తున్నాము. కావున మీరూ నిరీక్షించండి, నిశ్చయంగా మేము కూడా మీతోపాటు నిరీక్షిస్తున్నాము!"

قُلْ اَنْفِقُوْا طَوْعًا اَوْ كَرْهًا لَّنْ يُّتَقَبَّلَ مِنْكُمْ ۭ اِنَّكُمْ كُنْتُمْ قَوْمًا فٰسِقِيْنَ ۝٥٣

53. ఇలా అను: "మీరు మీ (సంపదను) ఇష్టపూర్వకంగా ఖర్చుచేసినా, లేదా ఇష్టం లేకుండా ఖర్చుచేసినా అది మీ నుండి స్వీకరించబడదు.[36] నిశ్చయంగా, మీరు అవిధేయులు (ఫాసిఖూన్)."

وَمَا مَنَعَهُمْ اَنْ تُقْبَلَ مِنْهُمْ نَفَقٰتُهُمْ اِلَّآ اَنَّهُمْ كَفَرُوْا بِاللّٰهِ وَبِرَسُوْلِهٖ وَلَا يَاْتُوْنَ الصَّلٰوةَ اِلَّا وَهُمْ كُسَالٰى وَلَا يُنْفِقُوْنَ اِلَّا وَهُمْ كٰرِهُوْنَ ۝٥٤

54. మరియు వారి విరాళం (చందా) స్వీకరించబడకుండా పోవటానికి కారణం, వాస్తవానికి వారు అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుణ్ణి తిరస్కరించడం మరియు నమా'జ్ కొరకు ఎంతో సోమరితనంతో తప్ప రాకపోవడం మరియు అయిష్టంతో (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టడమే![37]

فَلَا تُعْجِبْكَ اَمْوَالُهُمْ وَلَآ اَوْلَادُهُمْ ۭ اِنَّمَا يُرِيْدُ اللّٰهُ لِيُعَذِّبَهُمْ بِهَا فِي الْحَيٰوةِ الدُّنْيَا وَتَزْهَقَ اَنْفُسُهُمْ وَهُمْ كٰفِرُوْنَ ۝٥٥

55. కావున వారి సిరిసంపదలు గానీ, వారి సంతానం గానీ, నిన్ను ఆశ్చర్యంలో పడనివ్వకూడదు![38] నిశ్చయంగా, అల్లాహ్ వాటివలన వారిని ఇహలోక జీవితంలో శిక్షించగోరుతున్నాడు. మరియు వారు సత్యతిరస్కార స్థితిలోనే తమ ప్రాణాలను కోల్పోతారు.

وَيَحْلِفُوْنَ بِاللّٰهِ اِنَّهُمْ لَمِنْكُمْ ۭ وَمَا هُمْ مِّنْكُمْ وَلٰكِنَّهُمْ قَوْمٌ يَّفْرَقُوْنَ ۝٥٦

56. మరియు వారు నిశ్చయంగా, మేము మీతోనే ఉన్నామని అల్లాహ్‌పై ప్రమాణం చేస్తున్నారు. కాని వారు మీతో లేరు. వాస్తవానికి వారు మీకు భయపడుతున్నారు.

لَوْ يَجِدُوْنَ مَلْجَاً اَوْ مَغٰرٰتٍ اَوْ مُدَّخَلًا لَّوَلَّوْا اِلَيْهِ وَهُمْ يَجْمَحُوْنَ ۝٥٧

57. ఒకవేళ వారికి ఏదైనా ఆశ్రయంగానీ, గుహగానీ లేదా తలదాచుకోవటానికి ఏకాంత స్థలంగానీ దొరికితే, వారు తొందరగా పరుగెత్తి అందులో దాక్కుంటారు.[39]

---

36. చూడండి, 2:264, 4:38.

37. చూడండి, 'స.బు'ఖారీ, పు-1, 'హ. 626.

38. చూడండి, 20:131 మరియు 23:55-56. ఇంకా చూడండి, 3:178 మరియు 8:28.

39. ఈ ఆయత్ కపట విశ్వాసులను గురించి ఉంది. వారిని గురించి ఇంకా చూడండి, 4:142, 9:67 మరియు 29:11. (ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ఇది బహుశా కపటవిశ్వాసులను గురించి వచ్చిన మొట్టమొదటి ఆయత్).

وَمِنْهُم مَّن يَلْمِزُكَ فِي الصَّدَقَاتِ فَإِنْ أُعْطُوا مِنْهَا رَضُوا وَإِن لَّمْ يُعْطَوْا مِنْهَا إِذَا هُمْ يَسْخَطُونَ ﴿٥٨﴾

58. మరియు (ఓ ప్రవక్తా!) వారిలో కొందరు దానాలు (సదఖాత్) పంచే విషయంలో నీపై అపనిందలుమోపుతున్నారు.[40] దానినుండి వారికి కొంత ఇవ్వబడితే సంతోషిస్తారు. కాని దాని నుండి వారికి ఇవ్వబడకపోతే కోపగించు కుంటారు!

وَلَوْ أَنَّهُمْ رَضُوا مَا آتَاهُمُ اللَّهُ وَرَسُولُهُ وَقَالُوا حَسْبُنَا اللَّهُ سَيُؤْتِينَا اللَّهُ مِن فَضْلِهِ وَرَسُولُهُ إِنَّا إِلَى اللَّهِ رَاغِبُونَ ﴿٥٩﴾

59. మరియు ఒకవేళ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వారికి ఇచ్చిన దానితో వారు తృప్తిపడి: "అల్లాహ్‌యే మాకు చాలు! అల్లాహ్ తన అనుగ్రహంతో మాకు ఇంకా చాలా ఇస్తాడు మరియు ఆయన ప్రవక్త కూడా (ఇస్తాడు). నిశ్చయంగా, మేము అల్లాహ్‌నే వేడుకుంటాము!" అని పలికి ఉంటే (అది వారికే బాగుండేది!) (3/4)

إِنَّمَا الصَّدَقَاتُ لِلْفُقَرَاءِ وَالْمَسَاكِينِ وَالْعَامِلِينَ عَلَيْهَا وَالْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِي الرِّقَابِ وَالْغَارِمِينَ وَفِي سَبِيلِ اللَّهِ وَابْنِ السَّبِيلِ فَرِيضَةً مِّنَ اللَّهِ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿٦٠﴾

60. * నిశ్చయంగా, దానాలు (సదఖాత్)[41] కేవలం యాచించు నిరుపేదలకు మరియు యాచించని పేదవారికి,[42] (జకాత్) వ్యవహారాలపై నియుక్తులైన వారికి మరియు ఎవరి హృదయాలనైతే (ఇస్లాంవైపుకు) ఆకర్షించ వలసిఉందో వారికి, బానిసల విముక్తికొరకు, ఋణగ్రస్తులైన వారి కొరకు, అల్లాహ్ మార్గంలో (పోయేవారి) కొరకు మరియు బాటసారుల కొరకు. ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక

---

40. చూడండి, 2:263-264.

41. ఇక్కడ సదఖాత్ అంటే జకాత్ అని అర్థం. ఎనిమిది (8) రకాల వారు వీటికి హక్కుదారులు: (1) ఫుఖరాకు; (2) మసాకీన్‌లకు; (3) జకాత్ ప్రోగుచేయటానికి నియుక్తులైన వారికి; (4) ఎవరి హృదయాలను ఇస్లాం వైపునకు ఆకర్షించవలసిఉందో వారికి; (5) ముస్లిం బానిసల విముక్తికి; (6) ఋణగ్రస్తులైన వారికి; (7) అల్లాహ్ మార్గంలో మరియు (8) బాటసారులకు వారు పేదవారు కాకున్నా ప్రయాణంలో ఉన్నప్పుడు లేమికి గురిఅయితే వారికి ఇవ్వాలి.

42. ఫఖీరున్: అంటే ఏమీ ఆదాయం లేనందుకు తన నిత్యావసరాలకు ఇతరులపై ఆధారపడి ఉండేవాడు. ఇట్టివారు విధిలేక యాచించవచ్చు.

మిస్కీనున్: కొంత ఆదాయం గలవాడు కాని అది అతని నిత్యావసరాలకు సరిపోదు. అతడు ఇతరులతో యాచించుటకు వెనుకంజవేస్తాడు. తన స్వాభిమానంలో ఉంటాడు. ఇట్టివాడికి వాడి లక్షణాలు చూసి ఇవ్వాలి. (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం).

విధి. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేకవంతుడు.

61. మరియు వారిలో కొందరు ప్రవక్తను తమ మాటలతోబాధకలిగించే వారున్నారు. వారంటారు: "ఇతను (చెప్పేదంతా) వినేవాడు."[43] ఇలా అను: "అతనువినేది మీమేలుకే! అతనుఅల్లాహ్‌ను విశ్వసిస్తాడు మరియు విశ్వాసులను నమ్ముతాడు మరియు మీలో విశ్వసించిన వారికి అతను కారుణ్య మూర్తి." మరియు అల్లాహ్ సందేశహరునికి బాధ కలిగించే వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

وَمِنْهُمُ الَّذِيْنَ يُؤْذُوْنَ النَّبِيَّ وَيَقُوْلُوْنَ
هُوَ اُذُنٌ ؕ قُلْ اُذُنُ خَيْرٍ لَّكُمْ يُؤْمِنُ بِاللّٰهِ
وَيُؤْمِنُ لِلْمُؤْمِنِيْنَ وَرَحْمَةٌ لِّلَّذِيْنَ
اٰمَنُوْا مِنْكُمْ ؕ وَالَّذِيْنَ يُؤْذُوْنَ رَسُوْلَ اللّٰهِ
لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿٦١﴾

62. (ఓ విశ్వాసులారా!) మిమ్మల్ని సంతోషపెట్టటానికి వారు మీ ముందు అల్లాహ్‌పై ప్రమాణాలు చేస్తున్నారు. వాస్తవానికి వారు విశ్వాసులే అయితే, అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను సంతోషపెట్టటమే వారిబాధ్యత.[44]

يَحْلِفُوْنَ بِاللّٰهِ لَكُمْ لِيُرْضُوْكُمْ ۚ وَاللّٰهُ
وَرَسُوْلُهٗۤ اَحَقُّ اَنْ يُّرْضُوْهُ اِنْ كَانُوْا
مُؤْمِنِيْنَ ﴿٦٢﴾

63. ఏమీ? అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుణ్ణి విరోధించేవానికి, నిశ్చయంగా! భగభగమండే నరకాగ్నిశిక్ష ఉందనీ, అదే అతని శాశ్వత నివాసమనీ, వారికి తెలియదా? ఇది ఎంత గొప్ప అవమానం!

اَلَمْ يَعْلَمُوْۤا اَنَّهٗ مَنْ يُّحَادِدِ اللّٰهَ وَرَسُوْلَهٗ
فَاَنَّ لَهٗ نَارَ جَهَنَّمَ خَالِدًا فِيْهَا ؕ ذٰلِكَ
الْخِزْيُ الْعَظِيْمُ ﴿٦٣﴾

64. తమ హృదయాలలో ఉన్న (రహస్యాలను) స్పష్టంగా తెలియజేసేటటువంటి సూరహ్ వారికి విరుద్ధంగా అవతరింపజేయ బడుతుందేమోనని, ఈ కపటవిశ్వాసులు భయ పడుతున్నారు. వారితో అను: "మీరు ఎగతాళి చెయ్యండి, మీరు (బయటపడుతుందని) భయపడుతున్న విషయాన్ని, అల్లాహ్ తప్పక బయటపెడ్తాడు."

يَحْذَرُ الْمُنٰفِقُوْنَ اَنْ تُنَزَّلَ عَلَيْهِمْ سُوْرَةٌ
تُنَبِّئُهُمْ بِمَا فِيْ قُلُوْبِهِمْ ؕ قُلِ اسْتَهْزِءُوْا ۚ
اِنَّ اللّٰهَ مُخْرِجٌ مَّا تَحْذَرُوْنَ ﴿٦٤﴾

---

43. చూడండి, **9:74**.

44. చూడండి, **4:80** మరియు **3:31**.

65. నీవు వారిని అడిగితే వారు తప్పక: "మేము కేవలం కాలక్షేపానికి మరియు పరిహాసానికి మాత్రమే ఇలా మాట్లాడుతున్నాము." అని సమాధానమిస్తారు. వారితో అను: "ఏమీ మీరు అల్లాహ్‌తో మరియు ఆయన సూచనలతో (ఆయాత్‌లతో) మరియు ఆయన ప్రవక్తతో వేళాకోళం చేస్తున్నారా?

وَلَئِنْ سَأَلْتَهُمْ لَيَقُولُنَّ إِنَّمَا كُنَّا نَخُوضُ وَنَلْعَبُ ۚ قُلْ أَبِاللَّهِ وَآيَاتِهِ وَرَسُولِهِ كُنتُمْ تَسْتَهْزِئُونَ ٦٥

66. "ఇక మీరు సాకులు చెప్పకండి, వాస్తవానికి మీరు విశ్వసించిన తరువాత సత్యాన్ని తిరస్కరించారు." మీలో కొందరిని మేము క్షమించినా ఇతరులను తప్పకుండా శిక్షిస్తాము, ఎందుకంటే వాస్తవానికి వారు అపరాధులు.[45]

لَا تَعْتَذِرُوا قَدْ كَفَرْتُم بَعْدَ إِيمَانِكُمْ ۚ إِن نَّعْفُ عَن طَائِفَةٍ مِّنكُمْ نُعَذِّبْ طَائِفَةً بِأَنَّهُمْ كَانُوا مُجْرِمِينَ ٦٦

67. కపట విశ్వాసులైన పురుషులు మరియు కపటవిశ్వాసులైన స్త్రీలు అందరూ ఒకే కోవకు చెందినవారు! వారు అధర్మాన్ని ఆదేశిస్తారు. మరియు ధర్మాన్ని నిషేధిస్తారు.[46] మరియు తమ చేతులను (మేలునుండి) ఆపుకుంటారు. వారు అల్లాహ్‌ను మరచిపోయారు, కావున ఆయన కూడా వారిని మరచిపోయాడు.[47] నిశ్చయంగా, ఈ కపటవిశ్వాసులే అవిధేయులు (ఫాసిఖూన్).

الْمُنَافِقُونَ وَالْمُنَافِقَاتُ بَعْضُهُم مِّن بَعْضٍ ۚ يَأْمُرُونَ بِالْمُنكَرِ وَيَنْهَوْنَ عَنِ الْمَعْرُوفِ وَيَقْبِضُونَ أَيْدِيَهُمْ ۚ نَسُوا اللَّهَ فَنَسِيَهُمْ ۗ إِنَّ الْمُنَافِقِينَ هُمُ الْفَاسِقُونَ ٦٧

68. మరియు కపటవిశ్వాసులైన పురుషులకు మరియు కపటవిశ్వాసులైన స్త్రీలకు మరియు సత్యతిరస్కారులకు, అల్లాహ్ నరకాగ్ని వాగ్దానం చేశాడు. వారందులో శాశ్వతంగా ఉంటారు. అదే వారికి తగినది. మరియు అల్లాహ్ వారిని శపించాడు (బహిష్కరించాడు). మరియు వారికి ఎడతెగని శిక్ష ఉంటుంది.

وَعَدَ اللَّهُ الْمُنَافِقِينَ وَالْمُنَافِقَاتِ وَالْكُفَّارَ نَارَ جَهَنَّمَ خَالِدِينَ فِيهَا ۚ هِيَ حَسْبُهُمْ ۚ وَلَعَنَهُمُ اللَّهُ ۖ وَلَهُمْ عَذَابٌ مُّقِيمٌ ٦٨

69. (మీరు కూడా) గతించిన మీ పూర్వీకుల వంటివారు. వారు మీకంటే ఎక్కువ బలవంతులు,

كَالَّذِينَ مِن قَبْلِكُمْ كَانُوا أَشَدَّ مِنكُمْ قُوَّةً

---

45. చూడండి, **4:98**.
46. చూడండి, **3:104, 110, 114; 9:71, 112** మరియు **22:41**.
47. చూడండి, **45:34**.

وَأَكْثَرَ أَمْوَالًا وَأَوْلَادًا ۚ فَاسْتَمْتَعُوا بِخَلَاقِهِمْ فَاسْتَمْتَعْتُم بِخَلَاقِكُمْ كَمَا اسْتَمْتَعَ الَّذِينَ مِن قَبْلِكُم بِخَلَاقِهِمْ وَخُضْتُمْ كَالَّذِي خَاضُوا ۚ أُولَٰئِكَ حَبِطَتْ أَعْمَالُهُمْ فِي الدُّنْيَا وَالْآخِرَةِ ۖ وَأُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿٦٩﴾

ధనవంతులు మరియు అధిక సంతానం గలవారు. వారు తమభాగపు ఐహిక సుఖాలను అనుభవించారు. మీరు కూడా మీ పూర్వీకులు అనుభవించినట్లు మీ భాగపు ఐహికసుఖాలను అనుభవించారు. వారు పడి నటువంటి వ్యర్థ వాదోపవాదాలలో మీరు కూడా పడ్డారు. ఇలాంటివారి కర్మలు ఇహలోకం లోనూ మరియు పరలోకంలోనూ వ్యర్థమవుతాయి. మరియు ఇలాంటివారు! వీరే నష్టానికిగురిఅయ్యేవారు.

أَلَمْ يَأْتِهِمْ نَبَأُ الَّذِينَ مِن قَبْلِهِمْ قَوْمِ نُوحٍ وَعَادٍ وَثَمُودَ وَقَوْمِ إِبْرَاهِيمَ وَأَصْحَابِ مَدْيَنَ وَالْمُؤْتَفِكَاتِ ۚ أَتَتْهُمْ رُسُلُهُم بِالْبَيِّنَاتِ ۖ فَمَا كَانَ اللَّهُ لِيَظْلِمَهُمْ وَلَٰكِن كَانُوا أَنفُسَهُمْ يَظْلِمُونَ ﴿٧٠﴾

70. ఏమీ? వారి పూర్వీకుల గాథ వారికి అందలేదా? నూ'హ్‌జాతివారి, 'ఆద్, స'మూద్,[48] ఇబ్రాహీమ్ జాతివారి,[49] మద్‌యన్ (షు'ఐబ్) ప్రజల[50] మరియు తలక్రిందులు చేయబడిన పట్టణాల (లూ'త్) వారి (గాథలు అందలేదా)?[51] వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చారు. అల్లాహ్ వారికి అన్యాయం చేయదలచుకోలేదు కాని, వారే తమకుతాము అన్యాయం చేసుకుంటూ ఉన్నారు.

وَالْمُؤْمِنُونَ وَالْمُؤْمِنَاتُ بَعْضُهُمْ أَوْلِيَاءُ بَعْضٍ ۚ يَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ وَيُقِيمُونَ الصَّلَاةَ وَيُؤْتُونَ الزَّكَاةَ وَيُطِيعُونَ اللَّهَ وَرَسُولَهُ ۚ أُولَٰئِكَ سَيَرْحَمُهُمُ اللَّهُ ۗ إِنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٧١﴾

71. మరియు విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు ఒకరి కొకరు స్నేహితులు. వారు ధర్మాన్ని ఆదేశిస్తారు (బోధిస్తారు) మరియు అధర్మం నుండి నిషేధిస్తారు (వారిస్తారు) మరియు నమా'జ్‌ను స్థాపిస్తారు మరియు విధిదానం ('జకాత్) చెల్లిస్తారు మరియు అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. ఇలాంటి వారినే అల్లాహ్ కరుణిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

---

48. నూ'హ్, హూద్ మరియు 'సాలి'హ్ ('అలైహిమ్ స.)ల గాథల కొరకు చూడండి, **7:59-79**.

49. ఇబ్రాహీమ్ ('అ.స.) జాతివారు, బాబిలోనియనులు.**1100** సంవత్సరాలు క్రీస్తు శకానికి ముందు వారు అస్సీరియన్‌ల ద్వారా అపజయం పొంది నాశనం చేయబడ్డారు.

50. మద్‌యన్ ప్రజలగాథలకు చూడండి, **7:85-93**.

51. సోడోమ్ మరియు గొమోర్రాహ్‌లు, లూ'త్ ('అ.స.) ప్రజల నగరాలు. చూడండి, **7:80-84**, **11:69-83**.

وَعَدَ اللّٰهُ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا وَمَسٰكِنَ طَيِّبَةً فِيْ جَنّٰتِ عَدْنٍ ؕ وَرِضْوَانٌ مِّنَ اللّٰهِ اَكْبَرُ ؕ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿۷۲﴾

72. మరియు అల్లాహ్ విశ్వాసులైన పురుషులకు మరియు విశ్వాసులైన స్త్రీలకు క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాల వాగ్దానం చేశాడు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. మరియు శాశ్వతమైన సుఖాలున్న ఆ స్వర్గవనాలలో, వారి కొరకు పరిశుద్ధనివాసాలు ఉంటాయి.[52] వాటన్నిటికంటే మించింది వారికి లభించే అల్లాహ్ ప్రసన్నత. అదే ఆ గొప్ప సాఫల్యం (విజయం).

يٰۤاَيُّهَا النَّبِيُّ جَاهِدِ الْكُفَّارَ وَالْمُنٰفِقِيْنَ وَاغْلُظْ عَلَيْهِمْ ؕ وَمَاْوٰىهُمْ جَهَنَّمُ ؕ وَبِئْسَ الْمَصِيْرُ ﴿۷۳﴾

73. ఓ ప్రవక్తా! సత్యతిరస్కారులతో మరియు కపటవిశ్వాసులతో పోరాడు మరియు వారిపట్ల కఠినంగా వ్యవహరించు. మరియు వారి ఆశ్రయం నరకమే. మరియు అది అతిచెడ్డ గమ్యస్థానం.

يَحْلِفُوْنَ بِاللّٰهِ مَا قَالُوْا ؕ وَلَقَدْ قَالُوْا كَلِمَةَ الْكُفْرِ وَكَفَرُوْا بَعْدَ اِسْلَامِهِمْ وَهَمُّوْا بِمَا لَمْ يَنَالُوْا ۚ وَمَا نَقَمُوْۤا اِلَّاۤ اَنْ اَغْنٰىهُمُ اللّٰهُ وَرَسُوْلُهٗ مِنْ فَضْلِهٖ ۚ فَاِنْ يَّتُوْبُوْا يَكُ خَيْرًا لَّهُمْ ۚ وَاِنْ يَّتَوَلَّوْا يُعَذِّبْهُمُ اللّٰهُ عَذَابًا اَلِيْمًا فِي الدُّنْيَا وَالْاٰخِرَةِ ۚ وَمَا لَهُمْ فِي الْاَرْضِ مِنْ وَّلِيٍّ وَّلَا نَصِيْرٍ ﴿۷۴﴾

74. "మేము ఏమీ (చెడుమాట) అనలేదు!" అని వారు అల్లాహ్‌పై ప్రమాణంచేసి అంటున్నారు. కాని వాస్తవానికి వారు సత్యతిరస్కారపు మాట అన్నారు. మరియు ఇస్లాంనుస్వీకరించిన తరువాత దానిని తిరస్కరించారు. మరియు వారికి అసాధ్య మైన దానిని చేయదలచుకున్నారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త, (అల్లాహ్) అను గ్రహంతో వారిని సంపన్నులుగాచేశారనే కదా! వారు ఈ విధంగా ప్రతీకారం చేస్తున్నారు. ఇప్పుడైనా వారు పశ్చాత్తాపపడితే అది వారికే మేలు. మరియు వారు మరలిపోతే, అల్లాహ్ వారికి ఇహలోకం లోనూ మరియు పరలోకం లోనూ, బాధాకరమైన శిక్షవిధిస్తాడు. మరియు భూమిలో వారికి ఏ రక్షకుడు గానీ సహాయకుడు గానీ ఉండడు.(**7/8**)

وَمِنْهُمْ مَّنْ عٰهَدَ اللّٰهَ لَئِنْ اٰتٰىنَا مِنْ فَضْلِهٖ لَنَصَّدَّقَنَّ وَلَنَكُوْنَنَّ مِنَ الصّٰلِحِيْنَ ﴿۷۵﴾

75. * మరియు వారిలో (కొందరు) ఈ విధంగా అల్లాహ్‌పై ప్రమాణంచేసేవారు కూడా ఉన్నారు: "ఆయన (అల్లాహ్) తన అనుగ్రహంతో

---

52. చూడండి, **38:50**. 'అద్న్: అవతరణ ప్రకారం ఈ శబ్దం మొట్టమొదట పై ఆయత్‌లో వచ్చింది. 'అద్న్, అంటే శాశ్వతమైన అని అర్థం.

మాకేమి ప్రసాదించినా మేము తప్పక దానం చేస్తాము మరియు సద్వర్తనులమై ఉంటాము.''

فَلَمَّآ ءَاتَىٰهُم مِّن فَضْلِهِۦ بَخِلُوا۟ بِهِۦ وَتَوَلَّوا۟ وَّهُم مُّعْرِضُونَ ﴿٧٦﴾

76. కాని అల్లాహ్ తన అనుగ్రహం వల్ల వారికి (ధనం) ప్రసాదించినప్పుడు, వారు పిసినారితనం ప్రదర్శించి, తమ (వాగ్దానం) నుండి విముఖులై మరలిపోతారు.

فَأَعْقَبَهُمْ نِفَاقًا فِى قُلُوبِهِمْ إِلَىٰ يَوْمِ يَلْقَوْنَهُۥ بِمَآ أَخْلَفُوا۟ ٱللَّهَ مَا وَعَدُوهُ وَبِمَا كَانُوا۟ يَكْذِبُونَ ﴿٧٧﴾

77. ఆ పిదప వారు అల్లాహ్‌తో చేసిన వాగ్దానం పూర్తిచేయనందుకు, అసత్యం పలికినందుకు, ఆయన్ను కలుసుకునే (పునరుత్థాన) దినంవరకు, ఆయన వారి హృదయాలలో కాపట్యం నాటు కునేటట్లు చేశాడు.

أَلَمْ يَعْلَمُوٓا۟ أَنَّ ٱللَّهَ يَعْلَمُ سِرَّهُمْ وَنَجْوَىٰهُمْ وَأَنَّ ٱللَّهَ عَلَّٰمُ ٱلْغُيُوبِ ﴿٧٨﴾

78. ఏమీ? వారి గుప్త రహస్యాలు మరియు వారి రహస్య సమాలోచనలు, అల్లాహ్‌కు తెలుసని వారికి తెలియదా? మరియు నిశ్చయంగా, అల్లాహ్ అగోచర విషయాలన్నీ తెలిసివున్నవాడు.

ٱلَّذِينَ يَلْمِزُونَ ٱلْمُطَّوِّعِينَ مِنَ ٱلْمُؤْمِنِينَ فِى ٱلصَّدَقَٰتِ وَٱلَّذِينَ لَا يَجِدُونَ إِلَّا جُهْدَهُمْ فَيَسْخَرُونَ مِنْهُمْ سَخِرَ ٱللَّهُ مِنْهُمْ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٧٩﴾

79. మనస్ఫూర్తిగా సంతోషంతో (అల్లాహ్ మార్గంలో) దానంచేసే విశ్వాసులను నిందించే వారినీ మరియు తమశ్రమ తప్ప మరేమి ఇవ్వటానికి లేనివారిని ఎగతాళిచేసేవారినీ, అల్లాహ్ ఎగతాళికి గురిచేస్తాడు. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

ٱسْتَغْفِرْ لَهُمْ أَوْ لَا تَسْتَغْفِرْ لَهُمْ إِن تَسْتَغْفِرْ لَهُمْ سَبْعِينَ مَرَّةً فَلَن يَغْفِرَ ٱللَّهُ لَهُمْ ذَٰلِكَ بِأَنَّهُمْ كَفَرُوا۟ بِٱللَّهِ وَرَسُولِهِۦ وَٱللَّهُ لَا يَهْدِى ٱلْقَوْمَ ٱلْفَٰسِقِينَ ﴿٨٠﴾

80. (ఓ ప్రవక్తా!) నీవు వారి (కపట విశ్వాసుల) క్షమాపణకొరకు వేడుకున్నా, లేదా వారి క్షమాపణ కొరకు వేడుకోకపోయినా ఒక్కటే - ఇంకా నీవు డెబ్బైసార్లు వారి క్షమాపణ కొరకు వేడుకున్నా - అల్లాహ్ వారిని క్షమించడు.[53] ఎందు కంటే వాస్తవానికి వారు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు అల్లాహ్ అవిధేయులైన ప్రజలకు సన్మార్గం చూపడు.[54]

---

53. దైవ ప్రవక్త ముహమ్మద్ ('స'అస) తన శత్రువులను క్షమించమని అల్లాహ్ (సు.తా.)ను ప్రార్థించినట్లు బు'ఖారీ, ముస్లిం మరియు ఇతరుల 'స'హీ'హ్ 'హదీస్'లద్వారా తెలుస్తుంది.

54. చూడండి, **76:3**.

81. (తబూక్ దండయాత్రకు పోకుండా) వెనుక ఆగిపోయిన వారు, తాము అల్లాహ్ సందేశహరుని వెంట వెళ్ళటాన్ని నిరోధించి (తమ ఇండ్లలో) కూర్చుండి నందుకు సంతోషపడ్డారు. మరియు వారు తమ ధనసంపత్తులతో మరియు తమ ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడటాన్ని అసహ్యించుకున్నారు. మరియు వారు ఇతరులతో: "ఈ తీవ్రమైన వేడిలో వెళ్ళకండి!" అని అన్నారు. వారితో అను: "భగభగమండే నరకాగ్ని దీనికంటే ఎక్కువ వేడిగా ఉంటుంది." అది వారు అర్థంచేసుకుంటే ఎంత బాగుండేది!

فَرِحَ الْمُخَلَّفُونَ بِمَقْعَدِهِمْ خِلَافَ رَسُولِ اللَّهِ وَكَرِهُوا أَن يُجَاهِدُوا بِأَمْوَالِهِمْ وَأَنفُسِهِمْ فِي سَبِيلِ اللَّهِ وَقَالُوا لَا تَنفِرُوا فِي الْحَرِّ ۗ قُلْ نَارُ جَهَنَّمَ أَشَدُّ حَرًّا ۚ لَّوْ كَانُوا يَفْقَهُونَ ﴿٨١﴾

82. కావున ఇప్పుడు వారిని కొంత నవ్వ నివ్వు మరియు వారికర్మలకు ప్రతిఫలంగా (ముున్ముందు) వారికి ఎంతో ఏడ్వవలసి ఉంది.

فَلْيَضْحَكُوا قَلِيلًا وَلْيَبْكُوا كَثِيرًا جَزَاءً بِمَا كَانُوا يَكْسِبُونَ ﴿٨٢﴾

83. కావున (ఓ ప్రవక్తా!) ఒకవేళ అల్లాహ్ నిన్ను తిరిగి వారిలో (కపటవిశ్వాసులలో) ఒక వర్గం వారి వద్దకు తీసుకొనిపోతే! మరియు వారు నిన్ను (మరొక దండయాత్రకు) పోవటానికి అనుమతి అడిగితే! వారితో అను: "మీరు నాతో ఏ మాత్రం బయలుదేరవద్దు! మరియు నా పక్షమున శత్రువులతో పోరాడనూ వద్దు! వాస్తవానికి మీరు మొదట కూర్చొని ఉండటానికి ఇష్టపడ్డారు, కాబట్టి మీరు వెనుక ఉండిపోయిన వారితో (ఇండ్లలోనే) కూర్చొని ఉండండి."

فَإِن رَّجَعَكَ اللَّهُ إِلَىٰ طَائِفَةٍ مِّنْهُمْ فَاسْتَأْذَنُوكَ لِلْخُرُوجِ فَقُل لَّن تَخْرُجُوا مَعِيَ أَبَدًا وَلَن تُقَاتِلُوا مَعِيَ عَدُوًّا ۖ إِنَّكُمْ رَضِيتُم بِالْقُعُودِ أَوَّلَ مَرَّةٍ فَاقْعُدُوا مَعَ الْخَالِفِينَ ﴿٨٣﴾

84. మరియు వారిలో (కపటవిశ్వాసులలో) ఎవరైనా మరణిస్తే, అతడి నమా'జే జనా'జహ్

وَلَا تُصَلِّ عَلَىٰ أَحَدٍ مِّنْهُم مَّاتَ أَبَدًا وَلَا تَقُمْ

عَلٰى قَبْرِهٖ ؕ اِنَّهُمْ كَفَرُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ وَمَاتُوْا
وَهُمْ فٰسِقُوْنَ ﴿٨٤﴾

కూడా నీవు ఏ మాత్రం చేయకు మరియు అతని గోరీవద్ద కూడా నిలబడకు.[55] నిశ్చయంగా, వారు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు వారు అవిధేయులు (ఫాసిఖూన్)గా ఉన్న స్థితిలోనే మరణించారు.

وَلَا تُعْجِبْكَ اَمْوَالُهُمْ وَاَوْلَادُهُمْ ؕ اِنَّمَا يُرِيْدُ اللّٰهُ اَنْ
يُّعَذِّبَهُمْ بِهَا فِى الدُّنْيَا وَتَزْهَقَ اَنْفُسُهُمْ وَهُمْ كٰفِرُوْنَ ﴿٨٥﴾

85. మరియు వారి సిరిసంపదలు మరియు వారి సంతానం నిన్ను ఆశ్చర్యానికి గురిచేయ నివ్వకూడదు. నిశ్చయంగా, అల్లాహ్! వాటితో ఈ ప్రపంచంలో వారిని శిక్షించాలనీ మరియు వారు సత్యతిరస్కారులుగా ఉన్న స్థితిలోనే వారి ప్రాణాలను కోల్పోవాలనీ సంకల్పించాడు.[56]

وَاِذَاۤ اُنْزِلَتْ سُوْرَةٌ اَنْ اٰمِنُوْا بِاللّٰهِ وَجَاهِدُوْا مَعَ
رَسُوْلِهِ اسْتَاْذَنَكَ اُولُوا الطَّوْلِ مِنْهُمْ وَقَالُوْا ذَرْنَا
نَكُنْ مَّعَ الْقٰعِدِيْنَ ﴿٨٦﴾

86. మరియు: "అల్లాహ్‌ను విశ్వసించండి. మరియు ఆయన ప్రవక్తతో కలసి (అల్లాహ్ మార్గంలో) పోరాడండి!" అని సూరహ్ అవతరింపజేయబడినపుడు,[57] వారిలోని ధన వంతులు నీతో: "వెనుక ఉండేవారితో కూర్చోవటానికి మమ్మల్ని విడిచిపెట్టు." అని అనుమతి కోరారు.

---

55. ఈ ఆయత్ కపటవిశ్వాసుల నాయకుడు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబైను గురించి అవతరింపజేయ బడింది. కాని ఈ ఆజ్ఞ కపటవిశ్వాసులందరికీ వర్తిస్తుంది. 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినపుడు అతని కుమారుడు 'అబ్దుల్లాహ్ (ర'ది.'అ.) దైవప్రవక్త ('స'అస) దగ్గరికి వచ్చి, అతని ('స'అస) అంగీని, తన తండ్రికి కఫన్‌గా తొడిగించటానికి అడుగుతారు మరియు అతని ('స'అస)తో, తన తండ్రి నమా'జే జనా'జహ్ చేయమని కూడా కోరుతారు. దైవప్రవక్త ('స'అస) తన అంగీని, ఇస్తారు. 'ఉమర్ (ర'ది.'అ.) ఆపినా, వినకుండా నమా'జే జనా'జహ్‌కూడా చేస్తారు. ఆ తరువాత ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ('స'హీ'హ్ బు'ఖారీ, తఫ్సీర్ సూరహ్ అత్ తౌబహ్ మరియు 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ సిఫాత్ అల్ మునాఫిఖీన్ వ అ'హ్కామహుమ్). ఇక్కడ మరొక విషయం విశదమయ్యే దేమిటంటే: ఎవడైతే నిజమైన విశ్వాసుడు కాడో అతని మోక్షం కొరకు ఎంత పెద్దవారు ప్రార్థన చేసినా అది అంగీకరించబడదు.

56. చూడండి, **9:55, 3:178** మరియు **8:28;** ఈ ఆయత్ దాదాపు **9:55** మాదిరిగానే ఉంది.

57. చూడండి, **47:20.**

87. వారు, వెనక ఉండిపోయే వారితో ఉండటానికి ఇష్టపడ్డారు. వారి హృదయుల మీద ముద్ర వేయబడివుంది, కావున వారు అర్థం చేసుకోలేరు.[58]

رَضُوا بِأَن يَكُونُوا مَعَ الْخَوَالِفِ وَطُبِعَ عَلَىٰ
قُلُوبِهِمْ فَهُمْ لَا يَفْقَهُونَ ﴿٨٧﴾

88. కాని, ప్రవక్త మరియు అతనితో పాటు విశ్వసించిన వారు తమ సిరిసంపదలతో మరియు తమ ప్రాణాలతో (అల్లాహ్ మార్గంలో) పోరాడారు. మరియు అలాంటి వారికి అన్ని మేళ్ళూ ఉన్నాయి. మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు.

لَٰكِنِ الرَّسُولُ وَالَّذِينَ آمَنُوا مَعَهُ جَاهَدُوا
بِأَمْوَالِهِمْ وَأَنفُسِهِمْ ۚ وَأُولَٰئِكَ لَهُمُ الْخَيْرَاتُ ۖ
وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿٨٨﴾

89. అల్లాహ్ వారికొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు సిద్ధంచేసి ఉంచాడు, వారందులో శాశ్వతంగా ఉంటారు. అదే గొప్ప విజయం.

أَعَدَّ اللَّهُ لَهُمْ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ
خَالِدِينَ فِيهَا ۚ ذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ ﴿٨٩﴾

90. మరియు సాకులుచెప్పే ఎడారి వాసులు (బద్దూలు) [59] కూడా వచ్చి వెనుక ఉండిపోవటానికి అనుమతి అడిగారు. మరియు ఈ విధంగా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు అబద్ధాలు చెప్పినవారు కూర్చుండిపోయారు. త్వరలో సత్యతిరస్కారు లకు బాధాకరమైన శిక్ష ఉండగలదు.

وَجَاءَ الْمُعَذِّرُونَ مِنَ الْأَعْرَابِ لِيُؤْذَنَ لَهُمْ
وَقَعَدَ الَّذِينَ كَذَبُوا اللَّهَ وَرَسُولَهُ ۚ سَيُصِيبُ
الَّذِينَ كَفَرُوا مِنْهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٩٠﴾

91. బలహీనులు మరియు వ్యాధిగ్రస్తులు మరియు ప్రయాణపు ఖర్చులు లేనివారు, ఒకవేళ అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు వాస్తవానికి విశ్వాసపాత్రులై ఉంటే వారిపై (జిహాద్‌కు వెళ్ళకుంటే) ఎలాంటి నిందలేదు. సజ్జనులపై కూడా ఎలాంటి నిందలేదు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

لَّيْسَ عَلَى الضُّعَفَاءِ وَلَا عَلَى الْمَرْضَىٰ وَلَا عَلَى
الَّذِينَ لَا يَجِدُونَ مَا يُنفِقُونَ حَرَجٌ إِذَا نَصَحُوا
لِلَّهِ وَرَسُولِهِ ۚ مَا عَلَى الْمُحْسِنِينَ مِن سَبِيلٍ ۚ
وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿٩١﴾

---

58. చూడండి, **7:100-101**.

59. అల్ అ`అరాబు అంటే, ఎడారి వాసు(బద్దూ)లు. ఈ పదానికి ఇంకా చూడండి, **9:97, 98, 99, 101,120, 33:20, 48:11,16** మరియు **49:14**.

وَّلَا عَلَى الَّذِينَ إِذَا مَآ أَتَوْكَ لِتَحْمِلَهُمْ قُلْتَ
لَآ أَجِدُ مَآ أَحْمِلُكُمْ عَلَيْهِ تَوَلَّوا وَّأَعْيُنُهُمْ
تَفِيضُ مِنَ الدَّمْعِ حَزَنًا أَلَّا يَجِدُوا مَا
يُنفِقُونَ ۝٩٢

92. మరియు ఎవరైతే నీవద్దకు వచ్చి వాహనాలు కోరినప్పుడు నీవు వారితో: "నా దగ్గర మీకివ్వటానికి ఏ వాహనం లేదు." అని పలికినప్పుడు, ఖర్చు చేయటానికి తమ దగ్గర ఏమీ లేదు కదా అనే చింతతో కన్నీరు కార్చుతూ తిరిగిపోయారో, అలాంటి వారిపై కూడా ఎలాంటి నిందలేదు.

إِنَّمَا السَّبِيلُ عَلَى الَّذِينَ يَسْتَأْذِنُونَكَ
وَهُمْ أَغْنِيَآءُ ۚ رَضُوا بِأَن يَكُونُوا مَعَ
الْخَوَالِفِ وَطَبَعَ اللَّهُ عَلَىٰ قُلُوبِهِمْ فَهُمْ
لَا يَعْلَمُونَ ۝٩٣

93. (*) కాని వాస్తవానికి ధనవంతులై కూడా, వెనుక కూర్చున్నవారితో ఉండటానికి ఇష్టపడి, నిన్ను అనుమతి అడిగేవారిపై తప్పక నిందగలదు. అల్లాహ్ వారి హృదయాలమీద ముద్ర వేసిఉన్నాడు, కావున (తాము పోగొట్టు కొనేదేమిటో) వారికి తెలియదు.[60]

---

60. వీరు ఆయత్ **86,87**లలో పేర్కొనబడ్డ కపటవిశ్వాసులు.